




సభా వేదిక వద్ద ఏర్పాట్లు



సమరోత్సాహం

పసుపు పండుగకు చింతలపూడి ముస్తాబైంది.. టీడీపీ కేడర్ సమరోత్సాహంతో కదులుతోంది.. తమ అధినేత చంద్రబాబు పాల్గొనే సభను విజయవంతం చేసేందుకు గ్రామస్థాయి నుంచి నాయకులు, కార్యకర్తలు ఒకటిగా ముందడుగు వేస్తున్నారు. అసమర్థ వైసీపీ ప్రభుత్వాన్ని తరిమికొట్టేందుకు 'రా..కదలిరా' అంటూ చంద్రబాబు పూరించే సమరభేరికి హాజరయ్యేందుకు సమాయత్తమయ్యారు.

నేడు చింతలపూడిలో రా..కదలిరా

- చంద్రబాబు సభకు ఏర్పాట్లు పూర్తి
- భారీగా తరలివెళ్లేందుకు కేడర్ సమాయత్తం

చింతలపూడి, ఫిబ్రవరి 4 : చింతలపూడిలో నేడు టీడీపీ అధినేత చంద్రబాబు పాల్గొనే 'రా.. కదలిరా' బహిరంగ సభకు అన్ని ఏర్పాట్లు పూర్తయ్యాయి. చింతలపూడి శివారు ఏలూరు రోడ్డు పక్కన ఆంథోని నగర్‌లో పది ఎకరాల స్థలంలో బహిరంగ సభ జరగనుంది. సభా వేదిక, ప్రాంగణంలో బారికేడ్లు, ప్రాంగణం చుట్టూ ఆశావహులు, అభిమానులు, టీడీపీ, జనసేన ఫ్లెక్సీలు ఏర్పాటయ్యాయి. సభా ప్రాంగణం చుట్టూ ఫ్లెడ్‌లైట్లను ఏర్పాటు చేశారు. వేదికకు 300 మీటర్ల దూరంలో ఏర్పాటు చేసిన హెలిపాడ్ నిర్మాణం పూర్తయ్యింది. పార్కింగ్ స్థలాన్ని చదును చేశారు. వీఐపీలకు కూర్చునేందుకు కుర్చీలు ఏర్పాటు చేశారు. రోడ్డు పొడవునా భారీగా ఫ్లెక్సీలు ఏర్పాటు చేశారు. సభకు జిల్లాలోని ఏడు నియోజకవర్గాల నుంచి పార్టీ కార్యకర్తలు, ప్రజలు తరలిరానున్నారు. దాదాపు లక్ష మందికి పైగా జనం కొలువు తీరే సామర్థ్యంతో సభా ప్రాంగణాన్ని ఆ పార్టీ నాయకులు తీర్చిదిద్దారు. వీరిలో చింతలపూడి, పోలవరం నియోజకవర్గాల నుంచే భారీగా పార్టీ శ్రేణులు తరలివచ్చేలా పార్టీ నాయకులు చర్యలు తీసుకుంటున్నారు. కాగా చంద్రబాబు సమక్షంలో వైసీపీ, కాంగ్రెస్ నుంచి వేరుపడి టీడీపీ తీర్థం పుచ్చుకునేందుకు కొందరు సిద్ధమవుతున్నారు. హెలిపాడ్ స్థలాన్ని, బహిరంగ సభ వేదిక ప్రాంగణాన్ని జిల్లా ఎస్పీ మేరీ ప్రశాంతి ఆదివారం సాయంత్రం పరిశీలించారు. ఆమె వెంట జంగారెడ్డిగూడెం డీఎస్పీ ధనుంజయుడు, స్థానిక పోలీసు అధికారులు పాల్గొన్నారు.

చంద్రబాబు టూర్ షెడ్యూల్ ఇలా..

- మధ్యాహ్నం 1.45 గంటలకు అనకాపల్లి జిల్లా గొండుపాలెం నుంచి హెలికాప్టర్‌లో బయల్దేరి మధ్యాహ్నం 2.45 గంటలకు చింతలపూడి శివారు ఆంథోని నగర్‌లో ఏర్పాటుచేసిన హెలీప్యాడ్‌కు చేరుకుంటారు.
- 2.55 గంటలకు రోడ్డు మార్గంలో బయల్దేరి బహిరంగ సభ వేదిక వద్దకు చేరుకుంటారు
- మధ్యాహ్నం 3 గంటల నుంచి 4.30 గంటల వరకు సభలో ప్రసంగం
- సాయంత్రం 4.45లకు హెలీప్యాడ్‌కు చేరుకుని తాడేపల్లిలోని ఆయన నివాసానికి బయల్దేరి వెళ్లతారు.

'రా కదలిరా' విజయవంతం చేయండి

భీమడోలు/పోలవరం/బుట్టాయగూడెం/కొయ్యలగూడెం/కామవరపుకోట : చింతలపూడిలో సోమవారం మధ్యాహ్నం 2 గంటలకు జరిగే టీడీపీ రా కదలిరా సభను విజయవంతం చేయాలని జిల్లా టీడీపీ అధ్యక్షుడు, మాజీ ఎమ్మెల్యే గన్ని వీరాంజనేయులు పిలుపునిచ్చారు. ఉంగుటూరు నియోజకవర్గంలోని వివిధ ప్రాంతాల నుంచి సభకు వచ్చే కార్యకర్తలు, నాయకులు ఉదయం 11 గంటలకు గుండుగొలను చేరుకోవాలని అక్కడ నుంచి భారీ ర్యాలీగా చింతలపూడి తరలి వెళ్లనున్నట్టు ఆయన తెలిపారు. సభను విజయవంతం చేసేందుకు ప్రతి ఒక్కరు కృషి చేయాలన్నారు.

చింతలపూడిలో సోమవారం జరిగే 'రా..కదలిరా' బహిరంగ సభను విజయవంతం చేయాలని మాజీ మంత్రి కేఎస్ జవహర్, నియోజకవర్గ కన్వీనర్ బొరగం శ్రీనివాస్ పిలుపు నిచ్చారు. ఆదివారం పోలవరం, బుట్టాయగూడెం, కొయ్యలగూడెంలో పార్టీ శ్రేణులతో వారు సమావేశమయ్యారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ జగన్‌ను ఇంటికి పంపడానికి సంసిద్ధంగా ఉండాలని కేడర్‌కు పిలుపు నిచ్చారు. ఈ సమావేశాల్లో బుట్టాయగూడెం మండల పార్టీ అధ్యక్షుడు మొగపర్తి సోంబాబు, పోల వరం నియోజకవర్గ పరిశీలకుడు పోతుల అన్నవరం, మాజీ ఏఎంసీ చైర్మన్ పారేపల్లి రామారావు, కొయ్యలగూడెం మండల టీడీపీ అధ్యక్షుడు పారేపల్లి నరేష్, పట్టణ టీడీపీ అధ్యక్షుడు జ్యేష్ఠ రామకృష్ణ, జిల్లా తెలుగు మహిళా అధ్యక్షురాలు చింతల వెంకటరమణ, పోలవరం మండల పార్టీ అధ్యక్షుడు బొడ్డు కృష్ణ, మాజీ అధ్యక్షుడు పాపోలు గణపతి రత్తయ్య, సీనియర్ నాయకులు కుంచే దొరబాబు తదితరులు పాల్గొన్నారు. రా.. కదలిరా సభకు పార్టీ పరంగా ఏర్పాట్లు పూర్తయ్యాయని మాజీ ఎమ్మెల్యే ఘంటా మురళీ రామకృష్ణ, కామవరపుకోట మండల తెలుగుదేశం అధ్యక్షుడు కిలారు సత్యనారాయణ, నియోజకవర్గ బీసీ సెల్ అధ్యక్షుడు జిజ్జూరి బాబ్జీ, టీడీపీ జిల్లా ఉపాధ్యక్షుడు తూతా లక్ష్మణరావు పేర్కొన్నారు. కామవరపుకోటలో వారు మాట్లాడుతూ మండలంలోని అన్ని గ్రామాల నుంచి నాయకులు, కార్యకర్తలతో పాటు జనసేన కలిసి రావడంతో కేడర్‌లో నూతనోత్సాహం నెలకొందన్నారు. టీడీపీ గ్రామ కమిటీ అధ్యక్షుడు ఖాన్ వజీర్, స్వామినాథం పాల్గొన్నారు.



జగన్‌ను తరిమికొట్టండి : గన్ని

చింతలపూడిలో జరగనున్న రా.. కదలిరా బహిరంగ సభ వేదిక, ప్రాంగణంలో ఏర్పాట్లను జిల్లా టీడీపీ అధ్యక్షుడు గన్ని వీరాంజనేయులు పర్యవేక్షించారు. ఆయన మాట్లాడుతూ వైసీపీ దుర్మార్గపు పరిపాలనను అంతమొందించడానికి, జగన్మోహన్‌రెడ్డిని ఇంటికి పంపడానికి సమాయత్తం కావాలని, లేదంటే రాష్ట్ర భవిష్యత్తు, పిల్లల భవిష్యత్తు అగమ్యగోచరంగా మారుతుందన్నారు. ఐదేళ్లలో ఈ ప్రాంతంలోని పామాయిల్ రైతుల సమస్యలు పట్టించుకోలేదని, డ్రిప్ ఇరిగేషన్‌ను మూలన పడేశారని, సబ్సిడీ ఇవ్వడంలేదని, టీడీపీ హయాంలో చేపట్టిన చింతలపూడి ఎత్తిపోతలను వైసీపీ ప్రభుత్వం ఈ ఐదేళ్ళల్లో కనీసం పూర్తి చేయలేకపోయిందన్నారు. రోడ్లు అధ్వానంగా మారాయన్నారు. రానున్న ఎన్నికల్లో జగన్‌ను ఇంటికి పంపడానికి టీడీపీ-జనసేన ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న ఈ బహిరంగ సభలో చంద్రబాబు ఇచ్చే సందేశాన్ని వినడానికి వేలాదిగా ప్రజలు తరలిరానున్నారన్నారు. ఆయనతో పాటు మాజీ ఎమ్మెల్యే ఘంటా మురళి, టీడీపీ నాయకులు బొమ్మాజీ అనిల్, గోరుముచ్చు గోపాల్ యాదవ్, సొంగ రోషన్‌కుమార్, జె.ముత్తారెడ్డి, శ్యాం చంద్రశేషు, మారుటూరి వెంకట్రామయ్య, జనసేన నియోజకవర్గ ఇన్‌చార్జి మేకా ఈశ్వరయ్య తదితరులు పాల్గొంటారు. సభా ఏర్పాట్లను మాజీ ఎంపీ మాగంటి బాబు పర్యవేక్షించారు.





కొయ్యలగూడెంలో మాట్లాడుతున్న మాజీ మంత్రి జవహర్ .. కె.కోటలో మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే ఘంటా మురళీ రామకృష్ణ

ముందుకు కదలని చింతలపూడి ఎత్తిపోతలు

- రివర్స్ టెండరింగ్‌తో అటకెక్కిచ్చిన వైసీపీ ప్రభుత్వం
- చంద్రబాబుపైనే రైతుల ఆశలు



నిలిచిపోయిన చింతలపూడి ఎత్తిపోతల కాల్వ

చింతలపూడి/ నూజివీడు, ఫిబ్రవరి 4 : చింతలపూడి ఎత్తిపోతల పథకం.. మెట్ట ప్రాంత రైతుల కల. నాలుగు లక్షల 85 వేల ఎకరాలకు పైగా సాగునీరు అందించే ఈ పథకం వైసీపీ ప్రభుత్వ అస్తవ్యస్త విధానాలకు నిదర్శనంగా నిలుస్తోంది. 2006లో చింతలపూడి ఎత్తిపోతల పనులను రూ.1700 కోట్లతో మొదలు పెట్టారు. గత టీడీపీ హయాంలో ఈ పథకాన్ని విస్తరించి 4 వేల 909 కోట్లతో కృష్ణా జిల్లాలోని మెట్ట ప్రాంతాలకు సాగునీరు అందేలా ఫేజ్-1, ఫేజ్-2గా నిర్మాణాలు వేగవంతం చేశారు. 2017 సెప్టెంబరు 17వ తేదీన రూ.4,909 కోట్లతో (1, 2 ఫేజ్‌లు కలిపి) ఈ పనులకు నాటి ముఖ్యమంత్రి చంద్రబాబు విస్సన్నపేట మండలం మొద్దులపర్వ వద్ద శ్రీకారం చుట్టారు. 2019 తెలుగుదేశం ప్రభుత్వం దిగిపోయే నాటికి ఈ పథకానికి రెండేళ్లలో రూ.3,450 కోట్లు ఖర్చు చేసి మొత్తంగా ప్రాజెక్టులో 80 శాతం పూర్తి చేసింది. టీడీపీ ప్రభుత్వం భూసేకరణతో కలిపి ఫేజ్-2కి సుమారు రూ.200 కోట్లు ఖర్చు పెట్టింది. 2019లో వైసీపీ సర్కార్ అధికారంలోకి వచ్చాక రివర్స్ టెండరింగ్ పేరుతో పనులు నిలిపేశారు. మరో 1900 కోట్లు ఖర్చు చేసి ఉంటే ఈ ఐదేళ్లల్లో సాగునీరు, తాగునీరు అందేది. ఫేజ్-2లో నిర్వాసిత రైతులకు కేవలం రూ.26 కోట్లు నష్ట పరిహారం చెల్లిస్తే పథకం పూర్తి కావడానికి అవకాశం ఉండగా, ఈ ప్రభుత్వం పట్టించుకోవడం లేదని ఆయకట్టు రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. సొమ్ములు కోసం భూ నిర్వాసితులు కాళ్ళరిగేలా ప్రభుత్వ కార్యాలయాల చుట్టూ తిరుగుతున్నారు. చంద్రబాబు రా..కదలిరా సభలో చింతలపూడి ఎత్తిపోతల పథకం గురించి భరోసా ఇస్తారని రైతులు ఆశాభావం వ్యక్తం చేస్తున్నారు.

చింతలపూడిని వెంటాడుతున్న సమస్యలు


చింతలపూడి నియోజకవర్గం అభివృద్ధిలో ఇంకా వెనుకబడే ఉంది. ఎస్సీ నియోజకవర్గం అయినప్పటికీ తగిన నిధులు రాకపోవడంతో రోడ్లు, అభివృద్ధి కార్యక్రమాలు కొరవడ్డాయి. ఇక చింతలపూడి నియోజకవర్గ కేంద్రంలో వైద్యం, రోడ్లుగాని, రవాణాకు బస్సులు లేక ప్రజలు అనేక ఇబ్బందులు పడుతున్నారు.



చింతలపూడిలో సభాస్థలిని పరిశీలిస్తున్న మాగంటి బాబు, చాట్రాయి టీడీపీ నాయకులు

అప్పుడే.. కట కట

- మంచినీటి సరఫరాలో ప్రభుత్వ వైఫల్యం
- భీమవరం, తాడేపల్లిగూడెంలో సరఫరా సమయంలో విద్యుత్ కోతలు
- మోటార్లు ఉన్నాయంటూ మెలిక
- వేసవిలో మరింత దుర్భరం
- అమృత్ ప్రాజెక్టులు అమలులో విఫలం



(భీమవరం-ఆంధ్రజ్యోతి)

వేసవి వచ్చేస్తున్నది. నీటి వినియోగం పెరుగుతుంది. అప్పుడు మంచినీటికి మరింత కటకట లాడే పరిస్థితి తలెత్తనుంది. మోటార్లకు కూడా మంచినీరు అందే పరిస్థితి ఉండడం లేదు. బోరుబావుల్లో లభించే ఉప్పునీటిని వినియో గించుకోవాల్సిన దుస్థితి ఏర్పడుతుంది. గతంలో పుష్కలంగా మంచినీరు అందించేవారు. వేసవిలో అయితే మూడు పూటలా మంచినీరు ఇచ్చేలా ప్రజాప్రతినిధులు చర్యలు తీసుకునేవారు. వైసీపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత వర్షా కాలంలోనూ విద్యుత్ కోతలు విధిస్తున్నారు. వేసవిలో అయితే శివారు ప్రాంతాలకు గుక్కెడు మంచినీళ్లు సరఫరా అయ్యే అవకాశం లేకుండా పోతోంది.

సరఫరా వేళల్లో కోతలు

పట్టణాలకు మంచినీటి సరఫరాలో వైసీపీ ప్రభుత్వ వైఫల్యం కొట్టొచ్చినట్టు కనపడుతోంది. జిల్లాలో భీమవరం, తాడేపల్లిగూడెం మున్సిపాలిటీల్లో విద్యుత్ కోతలే అందుకు నిదర్శనం. మంచినీరు సరఫరా చేసే సమయంలో రెండు పట్టణాల్లోనూ విద్యుత్ కోతలు విధిస్తున్నారు. భీమవరంలో ఉదయం పూర్తిగా కోతలు విధిస్తున్నారు. సాయంత్రం సమయంలో సరఫరా చేసినప్పుడే విద్యుత్ సరఫరా ఉంటోంది. తాడేపల్లిగూడెం పట్టణంలో అయితే రెండు పూటలా కోతలు అమలు చేస్తున్నారు. మంచినీరు సమృద్ధిగా సరఫరా చేసేందుకు చర్యలు తీసుకోవడంలో ప్రభుత్వం పూర్తిగా విఫలమైంది పాలకవర్గాలు లేకపోవడంతో పర్యవేక్షణ లేకుండా పోయింది. మంచినీటి అవసరాలు తీర్చేందుకు అవసరమైన చర్యలు తీసుకోలేదు. కేంద్రం అమలు చేస్తున్న అమృత్ ప్రాజెక్టులను పూర్తి చేయలేకపోయారు. ఫలితంగా పట్టణాల్లో మంచినీటి కొరత ఏర్పడుతోంది. ప్రతి ఇంటికి మోటార్లు ఉండడం వల్లే విద్యుత్ కోతలు అమలు చేస్తున్నామంటూ అధికారులు కొత్త భాష్యం చెపుతున్నారు. తణుకు, పాలకొల్లు, నర్సాపురం పట్టణాల్లో కోతలు అమలు చేయడం లేదు. ఆ పట్టణాల్లోనూ ఇళ్లకు మోటార్లు ఉన్నాయి. ప్రతి పట్టణంలోనూ 75 శాతం ఆవాసాలకు మోటార్లు వినియోగిస్తున్నారు. వారంతా మంచినీటి సరఫరా సమయంలో మోటార్లు ద్వారా మున్సిపాలిటీ మంచినీటిని ట్యాంక్‌ల్లో నింపుకుంటున్నారు. ఏ పాలకవర్గంలోనూ విద్యుత్ కోతలు అమలు చేయలేదు. అవసరమైన చోటకు మంచినీటి ట్యాంకర్ల ద్వారా సరఫరా చేసేవారు. ఇప్పుడా పరిస్థితి లేదు. భీమవరం, తాడేపల్లిగూడెం మున్సిపాలిటీల్లో విద్యుత్ కోతలు అమలు చేస్తున్నారు.

అమృత్ ప్రాజెక్టుల అమలులోనూ జాప్యం

తెలుగుదేశం హయాంలో మంజూరైన అమృత్ ప్రాజెక్టులను పూర్తి చేయడంలోనూ ఇప్పటి ప్రభుత్వం విఫలమైంది. పట్టణాల్లో మంచినీటి సరఫరా కోసం తొలి విడత అమృత్ ప్రాజెక్టులో నిధులు కేటాయించారు. అలాగే అప్పట్లోనే తాడేపల్లిగూడెంలో రెండో సమ్మర్ స్టోరేజ్ ట్యాంక్, అండర్ గ్రౌండ్ డ్రైనేజీకి ప్రణాళికలు చేశారు. అమృత్‌లో నిధులు మంజూరయ్యాయి. అదే ప్రాజెక్టులను ఇప్పుడు అమృత్ 2.0లో మరోసారి మంజూరు చేయించారు. గతంలో పనులు దక్కించుకున్న కాంట్రాక్టర్ చేతులెత్తేయడంతో రెండో సమ్మర్ స్టోరేజ్ ప్రాజెక్టును రద్దు చేయాల్సి వచ్చింది. దానినే మళ్లీ అమృత్ 2.0లో మంజూరు చేశారు. జిల్లా వ్యాప్తంగా సుమారు రూ. 250 కోట్లు విలువైన పనులు చేపట్టాల్సి ఉంది. భీమవరం, తాడేపల్లిగూడెంలోనే సుమారు రూ. 200 కోట్ల విలువైన పనులు నిర్వహించాలి. తాగునీరు, డ్రైనేజీ వ్యవస్థలను అభివృద్ధి చేసేందుకు ఆ మొత్తం నిధులు వెచ్చించాలి. అయినా ప్రభుత్వం ఇప్పటివరకు పరిపాలనా అనుమతులు ఇవ్వలేదు. త్వరలోనే ఎన్నికల షెడ్యూల్ రానుంది. ఆ తర్వాత అనుమతులు ఇవ్వడానికి వీలు లేదు. ఆ ప్రాజెక్టులపై ఆశలు పూర్తిగా సన్నగిల్లాయి.



తాడేపల్లిగూడెంలో పైకప్పు లేకుండా దర్శనమిస్తున్న ఓవర్‌హెడ్ రిజర్వాయర్



పూలపల్లి సచివాలయం వద్ద నీటి కోసం ఆందోళన చేస్తున్న గాంధీ నగర్ వాసులు

రెండు నెలలుగా నీళ్లు లేవు

పాలకొల్లు రూరల్/పోడూరు ఫిబ్రవరి, 4 : రెండు నెలల నుంచి చుక్క మంచినీరు కూడా ఇవ్వడం లేదంటూ పూలపల్లి సచివాలయం వద్ద మూడో వార్డు గాంధీ నగర్ వాసులు ఆదివారం పెద్ద ఎత్తున ఆందోళన చేపట్టారు. అనేక సార్లు అధికారులకు మొరపెట్టుకున్నా ఫలితం లేదని వాపోయారు. మంచినీళ్లు ఇచ్చే వరకూ ఇక్కడ నుంచి కదిలేది లేదంటూ మహిళలు ఆగ్రహం వ్యక్తం చేశారు. సమాచారం తెలుసుకున్న పంచాయతీ కార్యదర్శి లింగం సత్యనారాయణ వారితో మాట్లాడారు. లంకల కోడేరు వాటర్‌ట్యాంక్ నుంచి అందించేందుకు చర్యలు తీసుకుంటామని, తక్షణం ట్యాంక్‌ల ద్వారా మంచినీళ్లు సరఫరా చేస్తామని హామీ ఇచ్చారు. పోడూరు మండలం అప్పన్న చెర్వు శివారు సబ్బేవానిపేటలో ఆదివారం మంచినీళ్లు సరఫరా కాకపోవడంతో ప్రజల ఇబ్బందులు పడ్డారు. మెయిన్ రోడ్డు పక్కన పైప్‌లైన్ పగిలిపోవడంతో ప్రాజెక్ట్ సిబ్బంది మంచినీటి సరఫరా నిలిపివేశారు.

రిజర్వాయర్‌పై పట్టించుకోని అధికారులు

తాడేపల్లిగూడెం మున్సిపాలిటీలో ఓవర్ హెడ్ రిజర్వాయర్ పూర్తిగా నాశనమైంది. పైకప్పు ఊడిపోయింది. దానికి మరమ్మతులు చేపట్టలేకపోతున్నారు. ట్యాంక్‌లో పక్షులు రెట్టలు వేస్తున్నాయి. పురుగులు పడుతున్నాయి. అదే ట్యాంక్ నుంచి పట్టణ ప్రజలకు మంచినీటిని సరఫరా చేస్తున్నారు. అంతే తప్పా పైకప్పును పూడ్చే ప్రయత్నం చేయడం లేదు. పట్టణంలో సమృద్ధిగా మంచినీటిని సరఫరా చేస్తున్నాం. శివారు ప్రాంతాలకు మంచినీటిని అందిస్తున్నాం అంటూ అధికారులు లెక్కకు మిక్కిలి గొప్పలు చెప్పుకొంటున్నారు. అంతే తప్పా ఓవర్ హెడ్ ట్యాంక్ మరమ్మతులు చేసేందుకు కనీస చర్యలు తీసుకోవడం లేదు.



పెనుగొండలో జనసేనతో కలిసి పితాని పాదయాత్ర

తెలుగుదేశం దూకుడు

జిల్లాలో పాదయాత్రలు, పోరుబాటలు

(భీమవరం-ఆంధ్రజ్యోతి): సార్వత్రిక ఎన్నికలు సమీపిస్తున్న తరుణంలో తెలుగుదేశం, జనసేన కూటమి నాయకులు దూకుడు పెంచారు. క్షేత్రస్థాయిలో ప్రజల్లోకి వెళ్లేలా పాదయాత్రలు, పోరుబాటలు నిర్వహిస్తున్నారు. అన్ని వర్గాలను ఆకట్టుకునే ప్రయత్నం చేస్తున్నారు. ఆచంట నియోజకవర్గంలో మాజీ మంత్రి పితాని సత్యనారాయణ రెండు నెలలపాటు పాదయాత్రకు శ్రీకారం చుట్టారు. నియోజకవర్గంలోని అన్ని గ్రామాలను చుట్టుముడు తున్నారు. జనసేన నాయకులను కలుపుకొని ఇంటింటికి వెళ్లి జనంతో కలుస్తున్నారు. పాలకొల్లులో ఎమ్మెల్యే నిమ్మల రామానాయుడు తాజాగా రైతు పోరుబాటు నిర్వహించారు. తెలుగుదేశం, జనసేన ఉమ్మడిగా పోరుబాట నిర్వహించింది. టిడ్కో ఇళ్లు, రుణాలు, రైతు సమస్యల వంటి విషయంలో పోరాటం చేస్తూ ప్రజలకు చేరువయ్యారు. ఉండి ఎమ్మెల్యే రామరాజు సైతం ఇంటింటికి రాంబాబు కార్యక్రమాన్ని నిర్వహిస్తూ అన్ని గ్రామాల్లో సుడిగాలి పర్యటన చేస్తున్నారు. భీమవరంలో నియోజకవర్గంలో తెలుగుదేశం, జనసేన పార్టీలు ఉమ్మడిగా సమావేశాలు ఏర్పాటు చేస్తున్నాయి. తాజాగా తెలుగుదేశం బీసీ పోరుబాట నిర్వహిస్తోంది. తాడేపల్లిగూడెంలోనూ తెలుగుదేశం పార్టీ కార్యక్రమాలను నిర్వహించడంలో ముందుంది. బాబుతో భవిష్యత్తుకు గ్యారంటీ కార్యక్రమాల ద్వారా నియోజకవర్గ ఇన్‌చార్జ్ వలవల బాబ్జి జనంలోకి వెళుతున్నారు. జనసేన ఇన్‌ఛార్జ్ బొలిశెట్టి ప్రత్యేకంగా పల్లెపోరు కార్యక్రమం చేపడుతూ గ్రామాల్లో పాదయాత్రలు నిర్వహిస్తున్నారు. ప్రతి నియోజక వర్గంలోనూ స్థానికంగా అధికార పార్టీ నేతలు, ప్రభుత్వ వైఫల్యాలు ఎండగడుతున్నారు. తణుకులో మాజీ ఎమ్మెల్యే ఆరిమిల్లి నేతృత్వంలో బాబుతో భవిష్యత్తుకు గ్యారంటీ కార్యక్రమాలను దాదాపు పూర్తి చేశారు. అధికార పార్టీ నుంచి తెలుగుదేశం లోకి నాయకులు, కార్యకర్తలను చేర్చుకోవడంలో ఆరిమిల్లి ముందు వరుసలో ఉన్నారు.జనసేన ఇన్‌ఛార్జ్ విడివాడ సైతం పల్లెపోరు కార్యక్రమాలను నిర్వహిస్తూ జనాన్ని కలిసే ప్రయత్నం చేస్తున్నారు. నరసాపురంలో తెలుగుదేశం, జనసేన ఉమ్మడి కార్యక్రమాలను నిర్వహిస్తూ వస్తున్నాయి. టీడీపీ ఇన్‌ఛార్జ్ పొత్తూరి రామరాజు, కొవ్వలి నాయుడు, జనసేన ఇన్‌చార్జ్ బొమ్మిడి నాయకర్‌లు నియోజకవర్గంలో కీలకంగా వ్యవహరిస్తున్నారు.



ట్రక్కు ఆటో బోల్తా ఇద్దరు మృతి



కోడి పందేలపై దాడి

రూ.4.89 లక్షల నగదు, 8 కార్లు, 29 బైక్‌లు స్వాధీనం

5



కాగితపు పడవల్ని గోదావరిలో వదులుతున్న బండారు

హార్బర్ పేరుతో ముదునూరి రియల్ దందా

మాజీ ఎమ్మెల్యే బండారు ఆరోపణ

నరసాపురం, ఫిబ్రవరి 4:హార్బర్ పేరుతో నరసాపురం ఎమ్మెల్యే ముదునూరి ప్రసాదరాజు తీరప్రాంతాల్లో పెద్ద ఎత్తున రియల్ ఎస్టేట్ దందా చేశారని వందల ఎకరాలను బినామీ పేర్లతో కొనుగోలు చేశారని మాజీ ఎమ్మెల్యే బండారు మాధవనాయుడు ఆరోపించారు. ఓట్లు వేసి గెలిపించిన ప్రజల్ని శిలా ఫలకాలు, శంకుస్థాపనలతో దగా చేస్తున్నారని మండిపడ్డారు. ఆదివారం వందలాది మంది టీడీపీ శ్రేణులతో కలిసి పట్టణం నుంచి బియ్యపుతిప్ప హార్బర్ స్థలం వరకు భారీ బైక్ ర్యాలీ నిర్వహించారు. నల్లిక్రిక్, హార్బర్ స్థలాల వద్ద ధర్నా చేసి నిరసన తెలిపారు. కాగితపు పడ వల్ని నీటిలో వదిలి ఎమ్మెల్యేకు వ్యతిరేకంగా నినాదాలు చేశారు. విలేకర్లతో మాట్లాడుతూ ముఖ్యమంత్రి జగన్ చేసిన రూ.3200 కోట్లు శంకుస్థాపన పనులు ఓ పెద్ద దగా అన్నారు. నల్లిక్రిక్ పనులు నిలిచిపోవడానికి ముదునూరే కారణమన్నారు. మత్స్యకారుల జీవ నోపాధికు ఉపయోగపడే ఈ క్రిక్‌ను తవ్వాలని రూ.19 కోట్లు కేటాయించి పనులు ప్రారంభించిందన్నారు. అధికారంలోకి రాగానే ముదునూరి వాటిని నిలుపుదల చేసి మత్స్యకారుల జీవనోపాధిపై దెబ్బకొట్టారన్నారు. ఆయన మోసాలను ప్రజలకు తెలియ జేయాలన్న ఉద్దేశంతోనే శంకుస్థాపన చేసిన స్థలాల వద్దకు వచ్చి నిరసన తెలుపుతున్నామన్నారు. ఈసారి ముదునూరి వేసే శిలాఫలాలు, శంకు స్థాపనలు నమ్మి మోసపోవొద్దన్ని ప్రజల్ని కోరారు. చిటికెల రామ్మోహన్, అంద్రాజు రామన్న, కొండేటి శ్రీను, నడిపూడి కృష్ణ, సత్యనారాయరాజు, కొట్టు పండు, హేమలత, తంగేళ్ల నాగేశ్వరరావు, రేవు ప్రభుదాసు, గన్నవరపు శ్రీను, బొల్లంపల్లి వెంకటనారాయణ తదితరులు పాల్గొన్నారు.

ముగిసిన గేట్ ప్రవేశ పరీక్ష



పరీక్షకు హాజరైన విద్యార్థులు

తాడేపల్లిగూడెం రూరల్, ఫిబ్రవరి 4: గ్రాడ్యుయేట్ ఆప్టిట్యూడ్ టెస్ట్ ఇన్ ఇంజనీరింగ్ (గేట్) ప్రవేశ పరీక్ష ఆదివారం ముగిసింది. తాడేపల్లిగూడెం వాసవి ఇంజనీరింగ్ కళాశాలలో ఆదివారం జరిగిన పరీక్షలో ఉదయం 125 మందికి గాను 118 మంది, మధ్యాహ్నం 104 మందికి 94 మంది పరీక్షకు హాజరైనట్టు ప్రిన్సిపాల్ రత్నాకరరావు తెలిపారు. పరీక్షల నిర్వహణ పరీక్షాకేంద్రం కో-ఆర్డినేటర్ నటరాజ్, సిస్టమ్స్ అడ్మిన్ కొల్లా సురేష్ పర్యవేక్షించారు.

11న రాష్ట్రస్థాయి చెస్ పోటీలకు క్రీడాకారుల ఎంపిక

భీమవరం అర్బన్, ఫిబ్రవరి 4: జిల్లా చెస్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఈనెల 11వ తేదీన భీమవరంలో జిల్లాస్థాయి అండర్-7,-9 బాలబాలికల చదరంగం పోటీలు నిర్వహిస్తామని జిల్లా చెస్ అసోసియేషన్ అధ్యక్షుడు మాదాసు కిషోర్ తెలిపారు. స్థానిక అనసూయ చెస్ అకాడమీలో ఉదయం 9 గంటల నుంచి ఎంపిక పోటీలు జరుగుతాయన్నారు. ఈ పోటీల్లో విజేతలు రాష్ట్రస్థాయి పోటీల్లో జిల్లా తరపున ప్రాతినిధ్యం వహిస్తారన్నారు. వివరాలకు 90632 24466 నంబరులో సంప్రదించాలన్నారు.

ఏపీ రెవెన్యూ సర్వీసుల సంఘ
రాష్ట్ర ప్రధాన కార్యదర్శిగా రమేష్‌కుమార్



రమేష్‌కుమార్

ఏలూరు ఎడ్యుకేషన్, ఫిబ్రవరి 4 :ఏపీ రెవెన్యూ సర్వీసుల సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శిగా ఏలూరుకు చెందిన కంచెర్లపల్లి రమేష్‌కుమార్ ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. విజ యవాడలో ఆదివారం జరిగిన సంఘ రాష్ట్ర కార్యవర్గ సమావేశం సందర్భంగా జరిగిన ఎన్నికల వివరాలను విలేకరులకు సంఘ నాయకులు తెలిపారు. ఇప్పటివరకు ప్రధాన కార్యదర్శిగా వున్న సీహెచ్.కృష్ణమూర్తికి డిప్యూటీ కలెక్టర్‌గా పదోన్నతి లభించినందున సంఘ నిబంధనల మేరకు ఆయన తన పదవినుంచి తప్పుకోగా, ఆమేరకు ఏర్పడిన ఖాళీని భర్తీ చేసేందుకు జరిగిన ఎన్నికలో రమేష్‌కుమార్‌ను ఎన్నుకున్నారు. రమేష్‌కుమార్ ప్రస్తుతం ఇదే సంఘానికి ఏలూరు జిల్లా అధ్యక్షుడిగా పనిచేస్తున్న విషయం విదితమే. రాష్ట్ర సమావేశంలో ఏపీఆర్ఎస్ఏ రాష్ట్ర అధ్యక్షుడు బొప్పరాజు వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు. పలువురు ఎన్జీవో, రెవెన్యూ, జేఏసీ నేతలు ఆయనకు శుభాకాంక్షలు తెలియజేసారు.

ఆవును చంపిన పెద్దపులి

- పాపికొండల అభయారణ్యం వైపుగా అడుగులు
- కొవ్వాడ ప్రాంతాల్లోని స్థానికుల్లో భయాందోళన





ఆవు కళేబరాన్ని పరిశీలిస్తున్న అటవీశాఖ అధికారులు (ఇన్‌సెట్‌లో) పులి పాదముద్ర

బుట్టాయగూడెం, ఫిబ్రవరి 4 : ఏజెన్సీలోని మన్యం ప్రాంతం నుంచి పదిరోజుల క్రితం పులి బయట ప్రాంతాలకు వెళ్లి తిరిగి ఆదివారం నాటికి అదేదారిలో పాపికొండల అభయారణ్యం వైపుగా మన్యం ప్రాంతానికి చేరుకుంది. ఉమ్మడి గోదావరి జిల్లా వాసులకు కంటిమీద కునుకులేకుండా చేసింది. ఆదివారం బుట్టాయగూడెం మండలం కొవ్వాడ అటవీ ప్రాంతంలో కొవ్వాడకు చెందిన కుంజం కొవ్వాడయ్య అనే గిరిజనుడికి చెందిన పాడిఆవును చంపి సగం తిని మిగతా కళేబారాన్ని వదిలేసింది. అతడు తన పశువులను ఊరికి దగ్గరలోని కొవ్వాడ కాల్వ వద్ద ప్రతిరోజు మాదిరిగా శనివారం రాత్రి కట్టేశాడు. ఈ గ్రామం అటవీ ప్రాంతానికి అతి దగ్గరగా గ్రామానికి అడవికి మధ్యలో కొవ్వాడ కాల్వ ఉంటుంది. శనివారం అర్ధరాత్రి సమయంలో ఏజెన్సీకి చేరుకున్న పులి కొవ్వాడయ్య పశువుల మందపై దాడిచేసి పాడిఆవును చంపి పక్కనే ఉన్న రాముడు జీడిమామిడి తోటలోకి లాక్కుపోయి సగం వరకు తిని మిగిలిన కళేబరాన్ని వదిలేసింది. ఆదివారం ఉదయం కొవ్వాడయ్య సోదరుడు రాజు పాలు తీసేందుకు పశువుల మందవద్దకు వెళ్లగా అవి కనిపించకపోవడంతో చుట్టుపక్కల వెతికాడు. కొంతదూరంలో ఆవు కళేబరాన్ని గుర్తించి కుటుంబ సభ్యులకు సమాచారం అందించాడు. పులి దాడిచేసినట్టు గుర్తించి అటవీశాఖ అధికారులకు సమాచారం ఇచ్చారు. రాత్రిపూట పులి దాడి చేయడంతో మిగిలిన పశువులు తాళ్లను తెంపుకుని పొలాల్లోకి పరారయ్యాయి. గ్రామస్థులు చుట్టుపక్కల వెతకడంతో చెదిరిపోయిన పశువులను గుర్తించి ఇళ్లకు తీసుకువచ్చారు. సమాచారం తెలుసుకున్న అటవీశాఖ అధికారులు ఘటనా స్థలానికి చేరుకుని పరిసర ప్రాంతాల్లో పర్యవేక్షణ ఆపరేషన్ చేశారు. ఆవు కళేబరం వద్దకు మరోసారి పులి వచ్చి అవకాశాలు ఉన్నందున అధికారులు, సిబ్బంది తగిన చర్యలు చేపట్టారు. ఆవు కళేబరాన్ని చూసి గిరిజనుడు కొవ్వాడయ్య కన్నీరు మున్నీరుగా విలపించడం అందరిని కంటతడి పెట్టించింది.

వణికిపోతున్న గిరిజన గ్రామస్థులు

ఏజెన్సీ ప్రాంతం నుంచి బయట ప్రాంతాలకు వెళ్లిన పులి తిరిగి ఆదివారం రోజున పాపికొండల అభయారణ్యం వైపుగా కనిపించింది. ఇప్పటికే పలుచోట్ల మేకలు, ఆవులు, పందిపై దాడిచేసిన పులి గమ్యస్థానానికి చేరుకునే లోపల ఇంకెన్ని పశువులను, మేకలను చంపుతుందోనంటూ ఆందోళన చెందుతున్నారు. అధికారులు మాత్రం అటవీ ప్రాంతాలకు దగ్గరలో ఉన్న గిరిజనులు, కొండరెడ్లు జాగ్రత్తగా ఉండాలని, ఒంటరిగా కాకుండా గుంపులుగా వెళ్లడం మంచిదని చెబుతున్నారు.

జగన్ నొక్కిన బటన్‌తో రైతులకు ఉరితాడు

- ఎమ్మెల్యే నిమ్మల రామానాయుడు
- 30 గ్రామాలు, 80 కిలోమీటర్లు సాగిన పాదయాత్ర



ఊటాడలో పాదయాత్ర చేస్తున్న ఎమ్మెల్యే నిమ్మల, తదితరులు

యలమంచిలి, ఫిబ్రవరి 4: సీఎం జగన్ బటన్ నొక్కి రైతాంగానికి ఉరితాడు వేశాడని పాలకొల్లు ఎమ్మెల్యే డాక్టర్ నిమ్మల రామానాయుడు ఆరోపించారు. జగన్ పాలనలో దగాపడిన, నష్టపోయిన రైతాంగానికి న్యాయం చేయాలని డిమాండ్ చేస్తూ ఆయన చేపట్టిన రైతుపోరుబాట పాదయాత్ర ఆదివారం ఉదయం ఊటాడ గ్రామం నుంచి ప్రారంభమై కాజతూర్పు, కాజపడమర, పెదమామిడిపల్లి, దిగమర్రు గ్రామాల మీదుగా కొనసాగి కొత్తపేటలో ముగిసింది. నియోజకవర్గంలో మూడు రోజులుగా 30 గ్రామాల మీదుగా 80 కిలోమేటర్ల మేర పాదయాత్ర సాగింది. పాదయాత్రలో వేలాది మంది రైతులు, మహిళలు, టీడీపీ, జనసేన శ్రేణులు పాల్గొని సంఘీభావం తెలిపారు. మహిళలు హారతులిచ్చి పాదయాత్రకు స్వాగతం పలికారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఏలూరు సభలో జగన్ 124సార్లు బటన్ నొక్కినట్టుగా చెప్పాడని, ఆయన నొక్కిన బటన్‌తో రైతులు, అన్నివర్గాల ప్రజలు నట్టేటముంచారని విమర్శించారు. ఆక్వారంగానికి విద్యుత్తు సబ్సిడీని ఎత్తివేసి సర్వనాశనం చేశాడని విమర్శించారు. వచ్చే ఎన్నికల్లో టీడీపీ-జనసేన కూటమి విజయం తథ్యమన్నారు. పాదయాత్రలో పాల్గొన్న అందరికి కృతజ్ఞతలు తెలిపారు. ఏఎంసీ మాజీ ఛైర్మన్ జి.గాంధీభగవాన్‌రాజు, మామిడిశెట్టి పెద్దిరాజు, బోనం నాని, రుద్రరాజు సత్యనారాయణరాజు, బొప్పన హరికిషోర్, తాళ్లూరి బుజ్జిబాబు, మాతా రత్నంరాజు, చెరుకూరి అంజిబాబు, సిద్దిరెడ్డి అప్పారావు, బోనం చినబాబు, కడలి గోపి, తాళ్లూరి సత్యశ్రీనివాస్, నెక్కంటి సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

ఆక్రమణల తొలగింపులో జాప్యమేల ?

- నెలలు గడుస్తున్నా నోటీసులతో సరి

వీరవాసరం, ఫిబ్రవరి 4: నవుడూరు జంక్షన్‌లోని నవుడూరు గ్రామ పంచాయతీ పరిధిలో గుర్తించబడిన ఆక్రమణల తొలగింపులో తీవ్రజాప్యం చోటు చేసుకుంది. నెలల తరబడి కాలయాపన సాగుతుంది. ఆక్రమణలు తొలగించమని ఫిర్యాదుదారులు స్పందనలో ఫిర్యాదు చేసినప్పటికీ కేవలం కాగితాలకే పరిమితం అవుతోంది. ఆ ప్రాంతానికి చెందిన చింతపల్లి శ్రీనివాసరావు, ఆర్అండ్‌బీ మార్జిన్‌లో ఉన్న ఆక్రమణలను తొలగించమని స్పందనలో జిల్లా కలెక్టర్‌కు ఫిర్యాదు చేశారు. గత ఏడాది నవంబరులో మొదటి ఫిర్యాదు అందించారు. దీనిపై గ్రామ పంచాయతీ స్పందించి సుమారు 40 మంది ఆక్రమణదారులను గుర్తించి నోటీసులు జారీ చేసింది. వీరిలో కొందరు తమ స్థలం ఆక్రమణ కాదని అధికారులకు తెలియజేస్తున్నారు. గ్రామ పంచాయతీ సైతం నోటీసులు జారీచేసి 15 రోజుల్లోగా సంజాయిషీ, వారివద్దనున్న రికార్డులతో హాజరు కావాలని తెలిపింది. ఇంతవరకూ ఆక్రమణల తొలగింపునకు నోటీసులు జారీయే కాని ఎటువంటి చర్యలు లేవని ఫిర్యాదుదారులు ఆవేదన చెందుతున్నారు. గత నవంబరులో రెండుసార్లు, డిసెంబరులో ఒకసారి, ఈ ఏడాది జనవరిలో ఒకసారి నోటీసులు జారీచేశారు. నోటీసులు ఇచ్చిన సమయం ముగుస్తుండగా ఆక్రమణల తొలగించాల్సిన అధికారులు సెలవుపై వెళ్లడం కాలవ్యవధి ముగిసిన అనంతరం విధుల్లో చేరుతునానరు. ఫిర్యాదుదారులు ప్రతీ సోమవారం జిల్లా కలెక్టర్‌కు ఫిర్యాదు చేస్తూనే ఉన్నారు. దీనిపై చర్యలుగా ఆక్రమణల తొలగింపునకు ఫైనల్ నోటీసు అంటూ నోటీసులు జారీ చేస్తున్నారు గానీ తొలగింపు పనులు మాత్రం జరగడం లేదు.

మావుళ్లమ్మ ఆలయంలో భక్తుల రద్దీ

- ఆఖరి ఆదివారం.. భారీగా వచ్చిన భక్తులు
- ఆకట్టుకున్న సాంస్కృతిక కార్యక్రమాలు







అమ్మవారిని దర్శించుకునేందుకు క్యూకట్టిన భక్తులు

కూచిపూడి, జానపద నృత్య ప్రదర్శనలు

భీమవరంటౌన్, ఫిబ్రవరి 4 : భీమవరం పట్టణంలోని మావుళ్ళమ్మ అమ్మవారి ఉత్సవాలు ముగింపు దశకు చేరుకున్న సందర్భంగా ఆఖరి ఆదివారం కావడంతో భారీగా భక్తులు తరలి వచ్చారు. అమ్మవారి ఆలయంతో పాటు పరిసర ప్రాంతాలు కిటకిటలాడాయి. ఉదయంనుంచి అమ్మవారిని భక్తులు దర్శించుకునేందుకు రావడంతో క్యూలైన్‌లు భక్తులతో నిండిపోయాయి. సాయంత్రం ఐదు గంటల నుంచి ఇతర ప్రాంతాల భక్తులు రావడంతో క్యూలైన్‌లు భారీగా పెరగాయి. భారీస్థాయిలో ఏర్పాటుచేసిన విద్యుత్ దీపాలంకరణను చూసేందుకు భక్తులు నిలబడిపోవడంతోపాటు ఫొటోలు తీసుకోవడంతో పందిళ్ళు రద్దీగా మారాయి. ఎటుచూసినా భక్తుల సందడే కనిపించింది. భక్తులకు ఎటువంటి ఇబ్బందులు తలెత్తకుండా దేవస్థానం అధికారులతోపాటు, ధర్మకర్తల మండలి, పోలీసు అధికారులు ప్రత్యేక చర్యలు తీసుకున్నారు. రాత్రి 9 గంటల ప్రాంతం వరకు రద్దీ కనిపించింది.

ఆకట్టుకున్న భరతనాట్యం

కొటికలపూడి గోవిందరావు కళావేదికపై ఆదివారం రాత్రి పట్టణానికి చెందిన బి.సత్యకుమార్ పర్యవేక్షణలో చిన్నారులు చేసిన కూచిపూడి, జానపద నృత్యప్రదర్శన భక్తులను ఎంతగానో ఆకట్టుకుంది. పలు కీర్తనలకు చిన్నారులు చేసిన నృత్యాలు ఔమరపించాయి. మూడు గంటలపాటు సాగిన కార్యక్రమాన్ని భక్తులు ఆసాంతం తిలకించారు. సాయంత్రం నాలుగు గంటలకు ఆలిపల్లికి చెందిన ఎ.తులసీమాత భగవద్గీత ప్రచార పీఠం వారిచే భగవద్గీత ప్రవచనాలు చేశారు. రాత్రి 9 గంటలకు భారీ సెట్టింగులతో సత్యహరిశ్చంద్ర నాటకం ప్రదర్శించారు.

'నా కుమార్తెను స్వదేశానికి రప్పించండి'



వినతిపత్రం అందిస్తున్న బాధితులు

తాడేపల్లిగూడెం రూరల్, ఫిబ్రవరి 4: బతుకు తెరువుకోసం ఖత్తర్ వెళ్లిన తన కుమార్తెను అక్కడ చిత్రహింసలు పెడుతున్నారని స్వదేశానికి రప్పించా లని ఆచంట మండలం చినపేటకు చెందిన బుద్దా ప్రభాకర్ కైండ్‌నెస్ సొసైటీ ఎం.డి. గట్టిం మాణిక్యాలరావుకు ఆదివారం వినతిపత్రం అందించారు. తన భార్య అనారోగ్యంతో ఉన్నప్పుడు వైద్యం కోసం చేసిన అప్పులు తీర్చేందుకు తన కుమార్తె చాందినిని ఖత్తర్ పంపించామని కానీ అక్కడ గదిలో పెట్టి బంధించి చిత్రహింసలు పెడుతున్నారని వాపోయాడు. డబ్బులు కడితేనే దేశానికి పంపుతామని లేదంటే జైలులో పెడతామని బెదిరిస్తున్నారని వాపోయారు.

'విర్డ్'లో విజయవంతంగా ఆర్థోపెడిక్ కాన్ఫరెన్స్



విర్డ్ ఆసుపత్రిలో లైవ్‌లో శస్త్ర చికిత్స జరుపుతున్న వైద్య ప్రతినిధులు

ద్వారకాతిరుమల, ఫిబ్రవరి 4: ద్వారకాతిరుమల విర్డ్ ఆసుపత్రిలో 'విర్డ్ ఆర్థోప్లాస్టీ హిప్, నీకాన్ క్లేవ్ ఆర్థోపెడిక్ కాన్ఫరెన్స్ విజయవంతంగా నిర్వహించారు. జాతీయస్థాయి ప్రముఖులైన 14మంది ఫ్యాకల్టీలు, 150 మంది వైద్య డెలిగేట్స్ పాల్గొన్నారు. దీనిలో భాగంగా ఈనెల 3, 4వ తేదీల్లో 16 శస్త్రచికిత్సలను వారు లైవ్‌లో చేశారు. మోకాలు, తుంటికి సంబంధించి ఇన్‌ఫెక్టెడ్, రివిజన్ శస్త్రచికిత్సలను విజయవంతంగా జరిపారు. ఆసుపత్రి ఛైర్మన్ ఎస్‌వీ సుధాకరరావు మాట్లాడుతూ ఇటువంటి శస్త్రచికిత్సలు వైద్యులు తమ విజ్ఞానాన్ని పెంచుకునేందుకు, నైపుణ్యతను మెరుగుపరుచుకునేందుకు ఉపయోగపడుతుందన్నారు. జాతీయస్థాయి ప్రముఖ వైద్యులు కృష్ణకిరణ్, రాజేష్‌మల్హోత్రా, విజయ్‌మోహన్, అనిల్‌థామస్, రాజ్‌కుమార్, సుమన్, శివయ్య, హేమంత్, కులకర్ణి, చంద్రశేఖర్, చెంచయ్య, వినయ్‌కిషోర్, భవ్యచంద్, ఇతర వైద్యులు పాల్గొన్నారు.

దగ్ధమైన కొబ్బరి గొడౌన్‌లో ఏఎస్పీ పరిశీలన



బాధితులతో మాట్లాడుతున్న ఏఎస్పీ భీమారావు

యలమంచిలి, ఫిబ్రవరి 4: ఆర్యపేట గ్రామంలో శనివారం రాత్రి జరిగిన అగ్నిప్రమాదంలో దగ్ధమైన కొబ్బరి గొడౌన్‌ను అడిషనల్ ఎస్పీ భీమారావు ఆదివారం పరిశీలించారు. పూర్తిగా కాలిపోయిన గొడౌన్‌ను, పరిసరాలను ఆయన పరిశీలించి వివరాలు తెలుసుకున్నారు. ఈ సందర్భంగా బాధితుడు కొడవటి కొండయ్య సుమారు రూ.1.40 కోట్లు నష్టపోయామని ఏఎస్పీకి విన్నవించారు. పాలకొల్లు రూరల్ సీఐ కె.సతీశ్, ఎస్ఐ కె.శ్రీమన్నారాయణ ఉన్నారు.

ఓటర్ల జాబితాలో తొలగించని మృతుల పేర్లు



ద్వారకాతిరుమల, ఫిబ్రవరి 4: ద్వారకాతిరుమల మండలంలో ప్రత్యేక ఓటర్ల నమోదు స్పెషల్ డ్రైవ్ కార్యక్రమం 64 పోలింగ్ కేంద్రాల్లో పూర్తయింది. ఓటర్ల జాబితాలో చనిపోయిన ఓటర్లు ఇంకా కొనసాగుతున్నారు. ఇవన్నీ వైసీపీ కార్యకర్తలు, సానుభూతిపరులకు చెందిన వారివని కోడిగూడెం టీడీపీ గ్రామ కమిటీ అధ్యక్షుడు గురజాల చంద్రరావు చెబుతున్నారు. ద్వారకాతిరుమల మండలం కోడిగూడెంలో 1,441 ఓట్లు ఉన్నాయి. దీనిలో 141వ పోలింగ్ కేంద్ర ఓటర్ల జాబితాలో చాలా ఏళ్లక్రితం మృతి చెందిన పలువురు ఇంకా ఓటర్లగా కొనసాగుతూనే ఉన్నారు. ఇటీవల మృతిచెందిన టీడీపీకి చెందిన వారి ఓట్లు జాబితాలో కనిపించకపోగా ఎప్పుడో మృతిచెందిన నాగమల్లి లక్ష్మి(1113), రాచపోతు అన్నవరం (1207), కొత్తూరి భీమయ్య (973), గొటికల నాగభూషణం (1295), బాతుల గాంధీ(574) తదితరులు చనిపోయినా ఓటరు జాబితాలో కొనసాగుతున్నారు. ఈ జాబితాలో మొత్తం ఇరవై మంది వరకు చనిపోయిన వారి పేర్లు ఇంకా ఎందుకు తొలగించలేదంటూ ప్రశ్నిస్తున్నారు.

క్రైం సమాచారం
వేర్వేరు చోట్ల ఏడుగురి మృతి

ఉమ్మడి పశ్చిమ జిల్లాలో ఆదివారం వేర్వేరుచోట్ల మొత్తం ఏడుగురు మృతి చెందారు. ఆచంట మండలంలో ట్రక్కు ఆటో బోల్తాపడి ఇద్దరు, ఆకివీడు మండలం ఉప్పుటేరులో దూకి యువకుడు, ఏలూరులో రైలు పట్టాలు దాటుతూ ఒకరు, దెందులూరు మండలం మేదినరావుపాలెంలో ఒకరు, ఏలూరు రూరల్ మండలం మెరక కాట్లంపూడి చెరువు వద్ద నివాసం ఉంటున్న మరొకరు, పెంటపాడు మండలంలో గుర్తుతెలియని యాచకుడు మృతి చెందారు.

ట్రక్కు ఆటో బోల్తా : ఇద్దరు బాలుర మృతి

- ఆసరా ఉత్సవాల భోజనానికి వెళ్లివస్తుండగా ఘటన
- మరో ఐదుగురికి గాయాలు.. ముత్యాలవారిపాలెంలో విషాదం
- డ్రైవర్ మద్యం మత్తులో ఉన్నాడని సమాచారం



ప్రమాదంలో మృతి చెందిన బాలురు, బోల్తా పడిన ట్రక్కు ఆటో

ఆచంట, ఫిబ్రవరి 4: ట్రక్కు ఆటో తిరగబడి ఇద్దరు బాలురు మృతి చెందగా మరో ఐదుగురికి గాయాలైన ఘటన కోడేరు వద్ద చోటుచేసుకున్నది. వివరాలివి.. ఆచంట మండలం కరుగోరుమిల్లి శివారు ముత్యాలవారిపాలెంకు చెందిన కుక్కల నాగరాజు చెందిన ట్రక్కు ఆటోలో నక్కా వాసుదేవ(13), మద్దాల సాయివెంకట్(12), కుక్కల విశ్వనాథం, కుక్కల కృష్ణ, నేలపూడి జయ, సుశాంత్, ఎ.నారాయణమూర్తి, నాగబాబు ఆదివారం తూర్పుపాలెంలో జరుగుతున్న ఆసరా ఉత్సవాలు నిమిత్తం వెళ్లి భోజనం చేసి తిరుగు ప్రయాణమయ్యారు. గ్రామానికి వస్తుండగా ఆచంట, కోడేరు ఆర్అండ్‌బీ రోడ్డులో కోడేరు సమీపం వద్ద టక్కు ఆటో బోల్తా పడడంతో ఇద్దరు బాలురు ఘటనా స్థలంలోనే మృతి చెందారు. మరో ఐదుగురికి గాయాలు కావడంతో పాలకొల్లు ఆసుపత్రికి తరలించారు. మృతులిద్దరూ ఆదివారం కావడంతో సరదాగా భోజనానికి వెళ్లినట్టు తెలిసింది. డ్రైవర్ మద్యం మత్తులో ఉన్న కారణంగానే ప్రమాదం సంబవించిందని సమాచారం. ఘటనా ప్రాంతానికి ఎస్ఐ ఎం.రాజ్‌కుమార్ విచ్చేసి వివరాలు తెలుసుకుని బాలుర మృతదేహాలను పోస్టుమార్టం నిమిత్తం పాలకొల్లు ప్రభుత్వాసుపత్రికి తరలించారు.

కుటుంబ నేపథ్యం ఇలా..

నక్కా వాసుదేవ అమ్మమ్మ ఇంటి వద్ద ఉంటూ కోడేరు గ్రామంలో 8వ తరగతి చదువుతున్నాడు. తల్లిదండ్రులు ఏసురత్నం, వీరవేణి ఇద్దరూ జీవనోపాధి నిమిత్తం గల్ఫ్‌లో ఉంటున్నారు. తల్లిదండ్రులకు ఏకైక కుమారుడు కావడంతో కుటుంబ సభ్యులు కన్నీరు మున్నీరుగా విలపించారు. మరో బాలుడు మద్దాల సాయి వెంకట్ తండ్రి శ్రీను గల్ఫ్‌లో ఉంటున్నాడు. తల్లి సుబ్బలక్ష్మి ఇటీవలే గల్ఫ్ నుంచి స్వదేశానికి వచ్చింది. అదే ఆటోలో తమ్ముడు నాగబాబు కూడా ఉన్నాడు. గాయాలతో బయటపడ్డాడు. గ్రామంలో విషాదచాయలు నెలకొన్నాయి.

భార్య కాపురానికి రావడం లేదని..

- పురుగుల మందు తాగి భర్త ఆత్మహత్య

ఏలూరు క్రైం, ఫిబ్రవరి 4 : భార్య కాపురానికి రావడంలేదని ఓ వ్యక్తి పురుగుల మందు తాగి తీవ్ర అస్వస్థతకు గురై ఏలూరు ప్రభుత్వాసుపత్రిలో చికిత్స పొందుతూ మృతి చెందాడు. దెందులూరు మండలం మేధినరావుపాలెం గ్రామానికి చెందిన ములగాల రాజు (30)కు భార్య, ఒక కుమారుడు, కుమార్తె ఉన్నారు. కూలి పనులు చేస్తూ కుటుంబాన్ని పోషిస్తున్నాడు. భార్యాభర్తల మధ్య విబేధాలు రావడంతో ఆమె పిల్లలను తీసుకుని పుట్టింటికి వెళ్ళిపోయింది. ఆమెను కాపురానికి రమ్మని ఎన్నిసార్లు పిలిచినా నిరాకరించడంతో జీవితంపై విరక్తి చెందిన అతడు రెండు రోజులక్రితం పురుగుల మందు తాగాడు. అస్వస్థతకు గురైన అతడిని ఏలూరు ప్రభుత్వాసుపత్రిలో చేర్పించారు. చికిత్స పొందుతూ ఆదివారం మృతి చెందాడు. ఈ ఘటనపై ఆసుపత్రి వైద్యులు ఎమ్మెల్సీగా నమోదు చేసి ఆసుపత్రి ఔట్‌పోస్టు పోలీసులకు సమాచారం ఇచ్చారు. ఈ ఘటనపై దెందులూరు ఎస్ఐ కె.స్వామి కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. ఏలూరు ప్రభుత్వాసుపత్రిలో పోస్టుమార్టం చేసి బంధువులకు అప్పగించారు.

చికిత్స పొందుతూ ఒకరి మృతి

ఏలూరు క్రైం, ఫిబ్రవరి 4 : కడుపునొప్పి బాధ భరించలేక ఓ వ్యక్తి గడ్డి నిర్మూలన మందుతాగి తీవ్ర అస్వస్థతకు గురై ఏలూరు ప్రభుత్వాసుపత్రిలో చికిత్స పొందుతూ ఓ వ్యక్తి మృతి చెందాడు. ఏలూరు రూరల్ మండలం మెరక కాట్లంపూడిచెరువు దగ్గర నివాసం ఉంటున్న బళ్ళవరపు మహేష్ (36) గత కొంతకాలం నుంచి కడుపునొప్పితో బాధపడుతున్నారు. ఆ బాధను భరించలేక ఈనెల మూడో తేదీన గడ్డిమందు తాగి అస్వస్థతకు గురైన అతడిని ఏలూరు ప్రభుత్వాసుపత్రిలో చేర్పించారు. చికిత్స పొందుతున్న అతడు ఆదివారం మృతి చెందాడు. ఈ ఘటనపై ఏలూరు రూరల్ పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

ఉప్పుటేరులో దూకి యువకుడి ఆత్మహత్య

ఆకివీడురూరల్ ఫిబ్రవరి 4 : ఆకివీడు మండలం ఉప్పుటేరులో దూకి ఆకివీడుకు చెందిన చొడిమెళ్ళ సోమశేఖర్(సోము)(24) అనే యువకుడు ఆత్మహత్యకు పాల్పడ్డాడు. ఆదివారం రాత్రి 8 గంటల సమయంలో ఉప్పుటేరు వంతెనపై నుంచి ఉప్పుటేరులోకి దూకినట్టుగా స్నేహితులు తెలపడంతో అగ్నిమాపక సిబ్బంది పడవలలో గాలింపు చేపట్టారు. సోము స్థానికంగా స్వీట్‌షాపులో పనిచేస్తున్నట్టు చెబుతున్నారు. సెల్‌ఫోన్ ఇంటివద్ద వదిలి, చెప్పులు వంతెనపై వదిలేసి ఉప్పుటేరులోకి దూకినట్టు చెబుతున్నారు. ఆకివీడు పోలీసులు అతడి స్నేహితులు నుంచి వివరాలు అడిగి తెలుసుకున్నారు.

రైలు ఢీకొని వ్యక్తి మృతి

ఏలూరు క్రైం, ఫిబ్రవరి 4:రైలుపట్టాలు దాటుతున్న ఓ వ్యక్తి ప్రమాదవశాత్తు రైలు ఢీకొనడంతో అక్కడికక్కడే మృతి చెందాడు. విజయనగరం జిల్లా తెర్లం మండలం రాజీపేట గ్రామానికి చెందిన జామున శానపతి సూర్యనారాయణ(59) ఏలూరు పెద్ద రైల్వేస్టేషన్ దగ్గరలో ఆదివారం తెల్లవారుజామున రైల ుపట్టాలు దాటుతుండగా గుర్తుతెలియని రైలు ఢీకొంది. అతడు అక్కడికక్కడే మృతి చెందాడు. ఈ సమాచారం ఏలూరు రైల్వే ఎస్ఐ డి.నరసింహారావుకు అందడంతో సిబ్బందితో ఘటనా స్థలాన్ని పరిశీలించారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ఏలూరు ప్రభుత్వాసుపత్రికి తరలించి బంధువులకు సమాచారం ఇచ్చారు.

యాచకుడి మృతి



వృద్ధుడి మృతదేహం

పెంటపాడు, ఫిబ్రవరి 4 : గుర్తుతెలియని యాచకుడు అనారోగ్యంతో చికిత్స పొందుతూ మృతి చెందినట్టు పెంటపాడు ఎస్ఐ బీ.మోహన్‌రావు తెలిపారు. ఎస్ఐ తెలిపిన వివరాలివి.. పెంటపాడు గ్రామంలో గత కొన్నిరోజులుగా భిక్షాటన చేస్తూ జీవనం సాగిస్తున్న గుర్తుతెలియని వ్యక్తి గతనెల 28న పెంటపాడు గేటు సెంటర్ వద్ద పడిపోయాడు. స్థానికులు స్పందించి అతడిని 108 వాహనంపై తాడేపల్లిగూడెం ఏరియా ఆసుపత్రికి తరలించగా చికిత్స పొందుతూ ఆదివారం సాయంత్రం మృతి చెందాడన్నారు. చనిపోయిన వ్యక్తికి 70 నుంచి 80 ఏళ్ల లోపు వయస్సు ఉంటుందని ప్రస్తుతం మృతదేహం ఆసుపత్రి మార్చురీలో ఉందన్నారు. ఎవరైన తెలిసిన వారుంటే 94407 96613 నంబరుకు సంప్రదించాలన్నారు.

అక్రమంగా తరలిస్తున్న మద్యం పట్టివేత

జీలుగుమిల్లి, ఫిబ్రవరి 4 : కారులో అక్రమంగా మద్యం తరలిస్తుండగా ఆదివారం పోలీసులు సరిహద్దు చెక్‌పోస్టు వద్ద తనిఖీల్లో పట్టుకుని కేసు నమోదు చేశారు. అశ్వారావుపేట మండలం కన్నాయిగూడెంకు చెందిన సున్నం సురేష్ కారులో తెలంగాణ మద్యం 48 క్వార్టర్ బాటిళ్లు తీసుకెళుతుండగా ఎస్ఐ వి.చంద్రశేఖర్ సిబ్బందితో కలసి పట్టుకున్నారు. వాహనం తనిఖీ చేసే క్రమంలో వ్యక్తి పరారయ్యాడు. పోలీసులు విచారణ అనంతరం కారు, మద్యం అదుపులోకి తీసుకుని నిందితుడిని అరెస్టు చేసి కేసు నమోదు చేశారు.

సారా విక్రయిస్తున్న వ్యక్తిపై కేసు

టి.నరసాపురం, ఫిబ్రవరి 4 : నాటుసారా విక్రయిస్తున్న వ్యక్తిపై కేసు నమోదు చేశామని ఎస్ఐ డి.దుర్గామహేశ్వరరావు తెలిపారు. బండివారిగూడెం గ్రామానికి చెందిన ఓ వ్యక్తి ప్రభుత్వంచే నిషేధించబడిన నాటు సారా విక్రయిస్తున్నాడనే సమాచారంతో ఆదివారం తన సిబ్బందితో దాడిచేసి అతని వద్ద నుంచి ఐదు లీటర్ల సారా స్వాధీనం చేసుకొని కేసు నమోదు చేశామని ఆయన తెలిపారు.



స్వాధీనం చేసుకున్న కార్లు, బైక్‌లు

కోడి పందేలపై పోలీసుల దాడి

- 23 మంది అరెస్టు.. రూ 4.89 లక్షల నగదు, 8 కార్లు, 29 బైక్‌ల స్వాధీనం

నరసాపురం రూరల్, ఫిబ్రవరి 4: మల్లవరంలంక గ్రామంలో పొలాల మధ్య ఫ్లడ్‌లైట్ల కాంతుల్లో నిర్వహిస్తున్న కోడిపందేల బరిపై పోలీసులు దాడి చేశారు. శనివారం అర్ధరాత్రి పక్కా సమాచారంతో రూరల్ ఎస్ఐ గురవయ్య, టౌన్ ఎస్ఐ ప్రసాద్ సిబ్బందితో దాడి చేసి 23 మందిని అదుపులోకి తీసుకుని రూ.4.89 లక్షల నగదు, ఎనిమిది కార్లు, 29 బైక్‌లు, 57 కత్తులు, 26 కోడి పుంజులు, 31 సెల్‌ఫోన్లు స్వాధీనం చేసుకుని పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. అధికార పార్టీకి చెందిన ముఖ్య నాయకుడు అండదండలతో ఈ బరి నిర్వహిస్తున్నారన్న ఊహాగానాలు షికారు చేస్తున్నాయి. పట్టుబడిన వారిలో భీమవరం, పాలకొల్లు, పాలకోడేరు, అకివీడు, టీపీగూడెం ప్రాంతాలకు చెందిన పందెం రాయుళ్లు ఉన్నారు. ఆకస్మికంగా పోలీసులు దాడి చేయడంతో చాలామంది చీకట్లో తప్పించుకున్నారు. గత కొంతకాలంగా గ్రామాల్లో కోడి పందేలు, జూదం విచ్చలవిడిగా నిర్వహిస్తున్నారు. పట్టుబడిన అందరిపై కేసులు నమోదు చేశామని పోలీసులు తెలిపారు.

దొంగలు పారిపోయిన
ఘటనపై కేసు నమోదు

ఏలూరు క్రైం, ఫిబ్రవరి 4 : పీటీ వారెంట్‌పై ఇద్దరు దొంగలను ఏలూరు కోర్టులో హాజరుపర్చడానికి జిల్లా జైలు నుంచి ఏలూరు త్రీటౌన్ పోలీసులు కోర్టుకు తీసుకురాగా వారిద్దరూ పారిపోయారు. ఈ ఘటనపై ఏలూరు త్రీ టౌన్ పోలీస్ స్టేషన్‌లో కేసు నమోదు చేశారు. అంతర్ రాష్ట్ర దొంగలైన తెలంగాణ రాష్ట్రం సత్తుపల్లి మండలం రామనగర్ గ్రామం నీలాల అనిల్‌కుమార్(20), అదిలాబాద్ జిల్లా మండమర్రి గ్రామానికి చెందిన బీమిల్లి రాజ్‌కుమార్‌నాయక్ (20) అనేక దొంగతనాలకు పాల్పడగా వారు పలు కేసుల్లో రిమాండ్ ఖైదీగా ఏలూరు జిల్లా జైలులో ఉన్నారు. ఏలూరు త్రీటౌన్ పోలీస్ స్టేషన్ పరిధిలో కూడా వీరిద్దరూ ఒక మోటారు సైకిల్‌ను అపహరించుకుపోయారు. ఈ ఘటనపై త్రీటౌన్ పోలీసులు నమోదు చేశారు. వారిద్దరిని పీటీ వారెంట్‌పై ఏలూరు కోర్టుకు హాజరుపర్చడానికి ఈనెల 3న జిల్లా జైలు నుంచి వారిద్దరినీ తీసుకురావడానికి ఎస్కార్ట్‌గా ఏలూరు త్రీటౌన్ కానిస్టేబుళ్ళు బి.హేమసుందర్, వై.రాజేష్ వెళ్ళి జిల్లా జైలు నుంచి ఏలూరు కోర్టునకు తీసుకువచ్చారు. మధ్యాహ్నం జిల్లా కోర్టు ఆవరణలో ఆ దొంగలు ఇద్దరు అకస్మాత్తుగా పోలీసులను తోసివేసి దాడి చేసి గోడదూకి పారిపోయారు. వారి కోసం వెతికినప్పటికీ ఆచూకీ కానరాలేదు. ఈ ఘటనపై హేమసుందర్ ఏలూరు త్రీటౌన్ పోలీసులకు ఫిర్యాదు చేయడంతో పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. పరారైన దొంగలను పట్టుకోవడానికి ప్రత్యేక బృందాలు రంగంలోకి దిగాయి.

పందెంరాయుడి బైండోవర్

ముసునూరు, ఫిబ్రవరి 4: లోపూడిలో కోడిపందేలు వేసేందుకు వచ్చిన వ్యక్తిని బైండోవర్ చేశామని ముసునూరు ఎస్ఐ వాసు తెలిపారు. ఆదివారం లోపూడిలో కోడిపందేలు వేస్తున్నట్టు అందిన సమాచారంతో నిఘా పెట్టగా లింగపాలెం మండలం లింగపాలెంకు చెందిన దాడినబోయిన సురేష్‌తోపాటు మరికొంతమంది పందేలు వేసేందుకు రాగా మిగిలిన పరారు కాగా సురేష్ అనే వ్యక్తి పట్టుబడ్డాడన్నారు. అతడిపై కేసు నమోదు చేసి, మండల ఇన్‌చార్జి తహసీల్దార్ ఎమిలికుమారి ఎదుట హాజరుపర్చామని పూచీకత్తుపై అతడిని బైండోవర్ చేసినట్టు ఎస్ఐ తెలిపారు.

ముందుగా గుర్తిస్తే క్యాన్సర్‌ను జయించవచ్చు


భీమవరంలో 3కే వాక్ నిర్వహిస్తున్న దృశ్యం

భీమవరం క్రైం, ఫిబ్రవరి 4 : క్యాన్సర్ అంటే అపోహ వద్దని, క్యాన్సర్ అంటే మరణం కాదని చికిత్స ఉందని భీమవరం ఒమేగా హస్పిటల్స్ సర్జికల్ ఆంకాలజిస్ట్ డాక్టర్ రేవంత్‌రెడ్డి గంగసాని, మెడికల్ ఆంకాలజిస్ట్ డా.కంతేటి ఆదిత్య పవన్‌కుమార్, రేడియేషన్ ఆంకాలజిస్ట్ డాక్టర్ నల్లం శ్రీకాంత్ అన్నారు. వరల్డ్ క్యాన్సర్‌డే సందర్భంగా ఆదివారం నాడు ఒమేగా భీమవరం హాస్పిటల్స్ ఆధ్వర్యంలో 3కే వాక్ నిర్వహించారు. ఈ సందర్భంగా డాక్టర్లు మాట్లాడుతూ వ్యాధి పట్ల అవగాహన పెంపొందించుకుని మెరుగైన వైద్యం తీసుకుంటే క్యాన్సర్‌ను జయించవచ్చని అన్నారు. ప్రస్తుతం కేసులు ఎక్కువగా పెరుగుతున్నాయని, అన్ని రకాల క్యాన్సర్‌లకు చికిత్స ఉందన్నారు. క్యాన్సర్ అంటే అపోహ వద్దని, ముందుగా గుర్తిస్తే 90శాతం వరకు ట్రీట్‌మెంట్ చేయవచ్చని అన్నారు. డిఎన్నార్ కళాశాల పాలకవర్గ సభ్యులు కొత్తపల్లి శివరామరాజు మాట్లాడుతూ చెడు వ్యసనాలకు దూరంగా ఉంటే క్యాన్సర్‌ను దూరం చేయవచ్చునని అన్నారు.

తహసీల్దార్ వెంకటేశ్వరి బాధ్యతల స్వీకరణ



ఆకివీడు, ఫిబ్రవరి 4: తహసీల్దార్‌గా జవ్వాది వెంకటేశ్వరి ఆదివారం బాధ్యతలు చేపట్టారు. కోనసీమ జిల్లా ఉప్పలగుప్తం నుంచి ఆకివీడు బదిలీపై వచ్చారు. ఇప్పటి వరకు ఇక్కడ పనిచేసిన తహసీల్దార్ ఎన్నీ విజయలక్ష్మి ఉమ్మడి కృష్ణాజిల్లా ఘంటసాలకు బదిలీపై వెళ్ళారు. వెంకటేశ్వరిని డీటీ ఫరూఖ్, వీఆర్వోలు సిబ్బంది కలిసి శుభాకాంక్షలు తెలిపారు.

నేడు ఎంపీడీవోగా రామకృష్ణ బాధ్యతల స్వీకారం



ఆకివీడు, ఫిబ్రవరి 4: ఎంపీడీవోగా యద్దనపూడి రామకృష్ణ సోమవారం బాధ్యతలు చేపట్టనున్నారు.ఉమ్మడి కృష్ణాజిల్లా పామర్రు నుంచి ఆకివీడు బదిలీపై వస్తున్నారు. ఇప్పటి వరకు ఇక్కడ పనిచేసిన ఎంపీడీవో కందుల వాణి ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా కొత్తపేటకు బదిలీపై వెళ్ళారు.

సిద్ధాపురంలో ఉచిత వైద్య పరీక్షలు



ఆకివీడు రూరల్ ఫిబ్రవరి 4 : సిద్ధాపురంలోని పెదపుల్లేటి రామరాజు మెమోరియల్ ట్రస్టు 4వ వార్షికోత్సవం సందర్భంగా ఉచిత మెగా వైద్య శిబిరం నిర్వహించారు. పిల్లలవైద్యులు కలిదిండి మహేష్ వర్మ పెదపుల్లేటి రామరాజు మెమోరియల్ ట్రస్టు ద్వారా ప్రతి నెల మొదటి ఆదివారం ఉచితంగా వైద్య సేవలందించి, మందులు పంపిణీ చేస్తారు. ట్రస్టు ఏర్పాటు చేసి 4 సంవత్సరాలైన సందర్భంగా గ్రామంలో సూపర్ స్పెషాలిటీ వైద్యులచే ఉచితంగా వైద్యసేవలందించారు. ఎమ్మెల్యే రామరాజు, లయన్స్‌క్లబ్ జిల్లా మాజీ గవర్నరు డాక్టర్‌ఎంవిఎస్, చెరుకుమిల్లి సొసైటీ మాజీ అధ్యక్షులు కనుమూరు అబ్బాయిరాజు, మాజీ సర్పంచ్ కన్నయ్యరాజు పాల్గొన్నారు.

7 నుంచి ఎఫ్‌ఎంఆర్‌ఏఐ సమావేశాలు

భీమవరం క్రైం, ఫిబ్రవరి 4 : ఈనెల 7, 8, 9 తేదీలలో విజయవాడ బసవపున్నయ్య విజ్ఞాన కేంద్రంలో ఎఫ్‌ఎంఆర్‌ఏఐ దేశ జనరల్ కౌన్సిల్ సమావేశాలు జరుగుతున్నాయని ఆంధ్రప్రదేశ్ మెడికల్ రిప్రజంటేటివ్స్ యూనియన్ భీమవరం శాఖ అధ్యక్షుడు కె.సూర్యచంద్రరాజు తెలిపారు. ఆదివారం నాడు మెడికల్ రిప్రజంటేటివ్స్ యూనియన్ ప్రతినిధులు జనరల్ కౌన్సిల్ సమావేశం గోడపత్రికను భీమవరంలో ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఏపీఎంఎస్‌ఆర్‌యు భీమవరంశాఖ కార్యదర్శి ఎస్.రమేష్, రాష్ట్రకార్యవర్గ సభ్యులు ఎస్.శ్రీనివాస్, సహాయ కార్యదర్శి టీఎస్‌వీ రవి, కోశాధికారి నాగేంద్రకుమార్ పాల్గొన్నారు.

9న హార్బర్ పనులు ప్రారంభిస్తాం

నరసాపురం రూరల్, ఫిబ్రవరి 9: బియ్యపుతిప్ప హార్బర్ పనుల్ని ఈనెల 9న ప్రారంభిస్తున్నట్లు రాష్ట్ర అగ్నికులక్షత్రీయ సంక్షేమ, అభివృద్ధి కార్పొరేషన్ చైర్మన్ తిరుమాని నాగరాజు చెప్పారు. ఆదివారం ఆయన నివాసంలో విలేకర్లతో మాట్లాడుతూ కేంద్రం నుంచి ఇప్పటి వరకు అనుమతులు రాలేదని, అందువల్ల పనుల్ని ప్రారంభించలేక పోయామన్నారు దీన్ని మాజీ ఎమ్మెల్యే బండారు రాజకీయం చేయడం సరికాదన్నారు. మంత్రి అప్పలరాజు ఈ పనుల్ని లాంఛనంగా మొదలుపెడతారన్నారు. ఏడాదిలోపు హార్బర్ పనులు పూర్తవుతాయన్నారు. ఎమ్మెల్యే ప్రసాదరాజు మచ్చలేని నాయకుడని కితాబు ఇచ్చారు. మత్స్యకార సంఘం నాయకులు కర్రి ఏసు, తిరుమాని కాంతారావు, శ్రీనువాస్ పాల్గొన్నారు.

సీనియర్ సిటిజన్స్‌కు వైద్య సేవలు

తణుకు, ఫిబ్రవరి 4: సీనియర్ సిటిజన్స్ వెల్ఫేర్ అసోసియేషన్, నిసా ఫౌండేషన్ సంయుక్త ఆధ్వర్యంలో సంచార శకటం ద్వారా ఆదివారం డాక్టర్ హాస్సేన్ అహ్మద్, డాక్టర్ సుంకవల్లి నీలు మహేంద్ర తణుకు, దువ్వ, పైడిపర్రు, ప్రాంతాల్లో పర్యటించి పదిమందికి ఉచితంగా వైద్య సేవలందించారు. సాయంత్రం సంఘ కార్యాలయంలో ప్రపంచ క్యాన్సర్ దినం నిర్వహించారు. సంఘ అధ్యక్షుడు అల్లూరి కరుణాకర్ చౌదరి, కార్యదర్శి కోడూరి సత్యనారాయణ, అర్జి భాస్కరరావు తదితరులు పాల్గొన్నారు.

సీపీఎంకు విరాళాలివ్వాలి

తణుకు, ఫిబ్రవరి 4: ప్రజల పక్షాన పోరాడే సీపీఎంకు విరాళాలివ్వాలని ఆ పార్టీ పట్టణ కార్యదర్శి పీవీ ప్రతాప్ కోరారు. ఆదివారం ఇందిరమ్మ కాలనీలో ప్రజల నుంచి విరాళాలు సేకరించారు. ఇందిరమ్మ కాలనీలో దోమలు నివారణకు చర్యలు తీసుకోవాలని, రహదారులకు మరమ్మతులు చేపట్టాలని కోరారు. పార్టీ నాయకులు గార రంగారావు, అడ్డగర్ల అజయకుమారి, గుబ్బల గోపి తదితరులు పాల్గొన్నారు.

ఎమ్మెల్యే రంగనాథరాజును కలిసిన ఉమాబాల

ఆచంట, ఫిబ్రవరి 4: నరసాపురం పార్లమెంట్ వైసీపీ ఇన్‌చార్జిగా నియమింపబడిన గూడూరి ఉమా బాల ఆదివారం తూర్పుపాలెంలోని ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయం వద్ద ఎమ్మెల్యే చెరుకువాడ శ్రీరంగనాధరాజును మర్యాదపూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛం అందజేశారు.

ఓటు ప్రాధాన్యం తెలుసుకోవాలి

భీమవరం టౌన్, ఫిబ్రవరి 4 : ఓటు ప్రాముఖ్యతను ప్రతిఒక్కరూ తెలుసుకోవాలని వక్తలు అన్నారు. శ్రీవిజ్ఞానవేదిక, రెవెన్యూ శాఖ ఆధ్వర్యంలో భీమవరం జంక్షన్ రైల్వే స్టేషన్ రోడ్డులో ఓటు హక్కు .. ఓటు వినియోగంపై అవగాహన ర్యాలీ, ప్రతిజ్ఞ కరపత్రాలు పంపిణీ కార్యక్రమాన్ని నిర్వహించారు. ప్రొఫెసర్ పి.అమూల్య రావు, రీడర్స్‌ఫోరమ్ అధ్యక్షుడు అరసవల్లి సుబ్రహ్మణ్యం, బొమ్మిడి వెంకటేశ్వర రావు, పాస్టర్ కృపావరం, నిర్వాహకులు చెరుకువాడ రంగసాయి పాల్గొన్నారు.

హిందూధర్మ పరిరక్షణే లక్ష్యం కావాలి

యలమంచిలి, ఫిబ్రవరి 4: వీహెచ్‌పీ, బజరంగ్‌దళ్ కార్యకర్తలు హిందూధర్మ పరిరక్షణే లక్ష్యంగా పనిచేయాలని విశ్వహిందూ పరిషత్ తెలుగు రాష్ట్రాల కార్యదర్శి శ్రీనివాసరెడ్డి అన్నారు. దొడ్డిపట్ల గ్రామంలో విశ్వహిందూపరిషత్, బజరంగ్‌దళ్ కార్యకర్తలకు ఆదివారం నిర్వహించిన జిల్లాస్థాయి శిక్షణ కార్యక్రమంలో శ్రీనివాసరెడ్డి ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ హిందూధర్మం పరిడవిల్లేలా గ్రామాల్లో కార్యక్రమాలు చేపట్టాలని అన్నారు. శిక్షణా కార్యక్రమంలో వ్యాయామం, యోగాసనాలు, సూర్యనమస్కారాలు నేర్పించారు. హిందూధర్మ పరిరక్షణకు చేపట్టాల్సిన అంశాలను వివరించారు.

విద్యార్థినికి మానవత చేయూత

తణుకు, ఫిబ్రవరి 4: విశాఖలో బీఏ ఎల్‌ఎల్‌బీ చదువుతున్న విద్యార్థిని ఎన్. హర్షితకు కళాశాల ఫీజు నిమిత్తం తణుకు మానవత సేవా సంస్థ ఆర్థిక సాయం అందించింది. ఆదివారం తణుకు రోటరీ క్లబ్‌లో సంస్థ నుంచి పదివేలు, మానవత సభ్యుడు ప్రొఫెసర్ డాక్టర్ ఆత్యం వెంకటేశ్వరరావు పది వేలు మొత్తం రూ. 20 వేలు అందించారు. మానవత జిల్లా శాంతి ర్యాలీ చైర్మన్ గమిని రాంబాబు, అక్కపంతులు బాలాజీ, ఆలపాటి సోమేశ్వరరావు, అక్కిన కాశీ, ఆలపాటి సుబ్బారావు తదితరులు పాల్గొన్నారు.

పెన్నాడలో డ్రెయినేజీలను శుభ్రపరచాలి..

పాలకోడేరు, ఫిబ్రవరి 4 : పెన్నాడ గ్రామంలోని చినపేటకు వెళ్ళే రహదారి వెంబడి ఉన్న డ్రెయినేజీల్లో కోళ్ళ వ్యర్థాలను వేస్తున్నారు. చికెన్ వ్యాపార నిర్వాహకులు డ్రెయినేజీల్లో వ్యర్థాలను వేయడం వలన దుర్వాసన వెదజల్లుతున్నాయని దళిత నాయకుడు కోరం ముసలయ్య ఆవేదన వ్యక్తం చేశాడు. దోమలు, ఈగలు పెరిగి రోగాలు చుట్టుముడుతున్నాయని, దుర్వాసన తట్టుకోలేకపోతున్నామన్నారు. పంచాయతీ అధికారులకు, జిల్లా వైద్యశాఖ అధికారులకు తెలియజేస్తానని ఆయన తెలిపారు.

కోమటిగుంటలో ఎమ్మెల్యే రామరాజు సమక్షంలో టీడీపీలో చేరిక.. గణపవరంలో పార్టీ నాయకులతో మాజీ ఎమ్మెల్సీ అంగర సమావేశం.. రాయకుదురులో టీడీపీ-జనసేన కరపత్రాల పంపిణీ.. భీమవరంలో టీడీపీ-జనసేన ప్రచారం

‘వైసీపీ పాలనలో ఆక్వా రంగం కుదేలు’

కాళ్ళ, ఫిబ్రవరి 4: వైసీపీ పాలనలో ఆక్వారంగం పూర్తిగా కుదేలైందని ఎమ్మెల్యే మంతెన రామరాజు విమర్శించారు. కోమటిగుంట గ్రామంలో టీడీపీ శ్రేణులతో కలిసి 'బాబుతో భవిష్యత్‌కు గ్యారెంటీ', ఇంటింటికి తెలుగు దేశం కార్యక్రమం ఆదివారం నిర్వహించారు. దీనిలో భాగంగా ఇంటింటికి వెళ్ళి సమస్యలను తెలుసుకోవడంతో పాటు పెరిగిన నిత్యావసర, విద్యుత్ చార్జీలు, గ్యాస్ ధరలు, ఇంటి పన్ను వంటి వివరాలు ప్రజలకు వివరించారు. ఇంటింటికి ప్రచారం చేస్తున్న సమయంలో గ్రామానికి చెందిన కాపుశెట్టి చంద్రావతి వైసీపీ పాలనలో సంక్షేమ పథకాలు ఇవ్వకుండానే ఇచ్చామంటూ ముద్రించిన కరపత్రాన్ని ఎమ్మెల్యేకి వైసీపీ ప్రభుత్వం తీరుపై తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేసింది. అనంతరం ఏర్పాటు చేసిన ప్రత్యేక సమావేశంలో ఎమ్మెల్యే రామరాజు మాట్లాడుతూ వైసీపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక పంట కాలువల వ్యవస్థ పూర్తిగా నిర్వీర్యం అయిందని విమర్శించారు. ఈసందర్భంగా గత పంచాయతీ ఎన్నికల్లో వైసీపీ తరుపున పోటీ చేసిన సర్పంచ్ అభ్యర్థి పులమంతుల ఏసురాజు, మాజీ సర్పంచ్ యలమంచిలి రామాంజనేయులు, కాపుశెట్టి వెంకటరమణతో పాటు పలువురు వైసీపీ నాయకులు ఎమ్మెల్యే సమక్షంలో టీడీపీలో చేరారు. కార్యక్రమంలో టీడీపీ మండలాధ్యక్షుడు జీవీ నాగేశ్వరరావు, ప్రధాన కార్యదర్శి మంతెన నాగాంజనేయులు, యలమంచిలి వెంకటరమణ, గ్రామాధ్యక్షుడు గుర్రం నాగవెంకట సత్యనారాయణ, తోట ఫణిబాబు పాల్గొన్నారు.

రా.. కదలి రా.. సభను విజయవంతం చేయాలి

గణపవరం, ఫిబ్రవరి 4: చింతలపూడిలో సోమవారం నిర్వహించే రా.. కదలి రా.. బహిరంగ సభను విజయవంతం చేయాలని టీడీపీ మాజీ ఎమ్మెల్సీ అంగర రామ్మోహన్ అన్నారు. ఆదివారం గణపవరంలో జరిగిన సమావేశానికి గణపవరం, నిడమర్రు మండలాల టీడీపీ కార్యకర్తలు, నాయకులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పార్టీ అధినేత చంద్రబాబు పాల్గొనే సభకు గ్రామాల నుంచి నాయకులు, కార్యకర్తలు పెద్దఎత్తున తరలిరావాలని పిలుపునిచ్చారు. రాష్ట్రం అభివృద్ధి చెందాలంటే చంద్రబాబు, పవన్‌కల్యాణ్ కూటమి విజయం అవసరమన్నారు. టీడీపీ గణపవరం అధ్యక్షుడు ఇందుకూరి రామకృష్ణంరాజు, పార్టీ నిడమర్రు అధ్యక్షుడు ముత్యాలస్వామి, జిల్లా ఆర్గనైజింగ్ కార్యదర్శి యాళ్ళ సుబ్బారావు, గణపవరం పట్టణ అధ్యక్షుడు సురేంద్రకుమారరాజు, కాపారం చిన్న, అద్దేపల్లి వాసురాజు తదితరులు పాల్గొన్నారు.

సమష్టి కృషితో విజయం సాధిద్దాం

మొగల్తూరు, ఫిబ్రవరి 4: జనసేన, టీడీపీ కార్యకర్తలు సమష్టి కృషితో పనిచేసి విజయం సాధిద్దామని జనసేన నియోజకవర్గ ఇన్‌చార్జి బొమ్మిడి నాయకర్ అన్నారు. ఆదివారం మొగల్తూరు రామాలయం వీధిలో మండలస్థాయి జనసేన పార్టీ కార్యాలయాన్ని సీనియర్ నాయకులు చినిమిల్లి సత్యనారాయణతో ప్రారంభించారు. కార్యక్రమంలో మండల జనసేన పార్టీ అధ్యక్షుడు కొల్లాటి గోపి, డాక్టర్ మాదంశెట్టి వెంకటేశ్వరరావు, కొటిపల్లి వెంకటేశ్వరరావు, దాసరి కృష్ణాజీ, నాగరాజు, లక్కు బాబి, బొక్కా చంటి, ఇంజేటి దానం, బందెల ఎలిషా, పులపర్తి ఏసులు పాల్గొన్నారు.

జగన్ పాలనలో పెట్రేగిన మద్యం, ఇసుక మాఫియా

పెనుగొండ, ఫిబ్రవరి 4: ఇసుక, మద్యం మాఫియాతో జగన్ ప్రభుత్వం ప్రజల్ని లూటీ చేసిందని మాజీ మంత్రి పితాని సత్యనారాయణ అన్నారు. ఆదివారం పెనుగొండలోని శివాలయం వీధి, గుబ్బల గూడెం, చిన్నవారిపాలెం, రామినీడివారి వీధి, బీడు ప్రాంతాలలో పితాని ఎన్నికల ప్రచార పాదయాత్ర నిర్వహించారు. అడుగడుగునా మహిళలు నీరాజనాలు పలుకుతూ హారతులు పట్టారు. ఏప్రిల్‌లో జరిగే సార్వత్రిక ఎన్నికల్లో సైకిల్ గుర్తుకు ఓటు వేసి అత్యధిక ఓట్లు మెజార్టీతో గెలిపించాలని అభ్యర్థించారు. ఈ సందర్భంగా పితాని మాట్లాడుతూ అవినీతి రాజ్యానికి రారాజు జగన్ రెడ్డి అని అన్నారు. ఒక పక్క సంక్షేమ బటన్ నొక్కుతూ మరొక పక్క రెట్టింపు సొమ్మును లూటి చేశారని గుర్తు చేశారు. దెందులూరులో జరిగిన సిద్ధం సభలో పాత్రికేయులపై వైసీపీ కార్యకర్తల దాడిని ఖండించారు. కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్సీ మల్లుల లక్ష్మీనారాయణ, సర్పంచ్ నక్కా శ్యామలా సోని శాస్త్రి, పిల్లి సత్తిరాజు, కటికిరెడ్డి నానాజీ, వేండ్ర రాము, మండా ప్రసాద్ పాల్గొన్నారు.

చిన అమిరంలో జనంలోకి జనసేన

భీమవరం, ఫిబ్రవరి 4 : తెలుగుదేశం-జనసేన పార్టీలను గెలిపిస్తేనే మనకు భవిష్యత్తు ఉంటుందని జనసేన జిల్లా ప్రధాన కార్యదర్శి, పట్టణ అధ్యక్షుడు చెనమల్ల చంద్రశేఖర్ అన్నారు. చినఅమిరంలో ప్రచారం నిర్వహించారు. గ్రామ నాయకులు రుద్రరాజు శ్రీనివాసరాజు, పత్తి హరివర్ధన్ ఆధ్వర్యంలో నిర్వహించారు. కార్యక్రమంలో రామాయణం శ్రీనివాస్, బండి రమేష్, కోళ్ల నాగబాబు, భగత్ సింగ్, మహేష్ పాల్గొన్నారు.

జగన్నాథపురంలో..

వీరవాసరం, ఫిబ్రవరి 4: రాయకుదురు శివారు జగన్నాథపురంలో ఆదివారం టీడీపీ, జనసేన నాయకులు జనంలోకి జనసేన కార్యక్రమాన్ని నిర్వహించారు. నాయకులు, కార్యకర్తలు ఇంటింటికీ తిరిగి ఉమ్మడి మేనిఫెస్టో కరపత్రాలను పంపిణీ చేశారు. నవరత్నాలు పేరుతో వైసీపీ చేస్తున్న మోసాలను తెలియజేశారు. వైసీపీ ప్రభుత్వానికి బుద్ధి చెప్పాలని ఉమ్మడి మేనిఫెస్టోతో వెడుతున్న టీడీపీ జనసేనకు మద్దతు ఇవ్వాలని కోరారు. కార్యక్రమంలో జడ్పీటీసీ సభ్యుడు గుండా జయప్రకాష్ నాయుడు, ఎంపీపీ వీరవల్లి దుర్గాభవాని చంద్రశేఖర్, మండలశాఖల అధ్యక్షులు వీరవల్లి శ్రీనివాసరావు, జవ్వాది బాలాజీ, ఎంపీటీసీ సభ్యులు కడలి నెహ్రూ, అడ్డాల శ్రీరామ చంద్రమూర్తి తదితరులు పాల్గొన్నారు.

కంటి, దంత సంరక్షణకు శ్రద్ధ తీసుకోవాలి

కాళ్ళ, ఫిబ్రవరి 4 : కంటి, దంత సంరక్షణ పట్ల ప్రజలు ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని భీమవరం ఎస్‌ఆర్‌కెఆర్ ఇంజనీరింగ్ కళాశాల ప్రిన్సిపాల్ కేవీ మురళీకృష్ణంరాజు అన్నారు. కళాశాల ఎన్‌ఎస్‌ఎస్ విభాగం ఆధ్వర్యంలో పెదఅమిరం పంచాయతీ కార్యాలయంలో ఆదివారం ఉచిత కంటి, దంత వైద్య శిబిరాలను ఏర్పాటు చేశారు. కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ డొక్కు సోమేశ్వరరావు, కళాశాల కోఆర్డినేటర్ మెహర్‌గాంధీ, కేవీ సత్యనారాయణ, మ్యాక్స్ విజన్ హెచ్‌ఆర్ పవన్‌కుమార్ పాల్గొన్నారు.

ఈ-పంట నమోదును ప్రతీ రైతు పరిశీలించాలి


శృంగవృక్షంలో ఈ-పంట నమోదు తెలుసుకుంటున్న జిల్లా వ్యవసాయాధికారి

పాలకోడేరు, ఫిబ్రవరి 4 : ఈ-పంట నమోదు ప్రక్రియను ప్రతీ రైతు పరిశీలించుకోవాలని జిల్లా వ్యవసాయాధికారి జె.వెంకటేశ్వరరావు అన్నారు. శృంగవృక్షం గ్రామంలో వరి పంట పొలాలను ఆయన ఆదివారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మండలంలో ఇప్పటి వరకు ఈ-క్రాప్ నమోదు చేయబడిన సర్వే నెంబర్లలో 20 నెంబర్లను పరిశీలించి నమోదు చేయించుకున్న రైతులతో మాట్లాడటం జరిగిందన్నారు. మండలంలో ఈ దాళ్వా సీజన్‌లో 11,500 ఎకరాల్లో వరి పంట సాగవుతుండగా నేటి వరకు 9,900 హెక్టార్లలో ఈ-పంట నమోదు చేయడం జరిగిందన్నారు. ఇదేవిధంగా ఈ-క్రాప్ నమోదు చేసిన డేటాను గ్రామ రెవెన్యూ అధికారి తనిఖీ చేసిన పిమ్మట రైతులకు వారి ఆధార్‌తో అనుసంధానం చేయడం జరుగుతుందన్నారు. ఈ ప్రక్రియ ఈ-క్రాప్ నమోదు, రైతులతో ఈకేవైసీ ఈనెల 10వ తేదీలోపు పూర్తి చేయవలిసిందిగా మండల వ్యవసాయాధికారులకు సూచించారు. భూములు ఉన్న రైతులందరూ రైతు భరోసా కేంద్రాలు వద్ద వివరాలు నమోదు చేసి పరిశీలించుకోవాలని తెలిపారు.

ఎన్నికల్లో బాధ్యతగా పనిచేయాలి

తణుకు, ఫిబ్రవరి 4: రానున్న ఎన్నికల్లో ప్రతి ఒక్కరూ బాధ్యతగా పనిచేయాలని బీజేపీ గోదావరి క్లస్టర్ కో-ఇన్‌చార్జి కోడూరి లక్ష్మీనారాయణ అన్నారు. ఆదివారం పార్టీ కార్యాలయంలో ఎన్నికల సన్నాహక సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఈ నెల 9, 10, 11 తేదీల్లో పోదాం పల్లెకు కార్యక్రమంలో ప్రతి కార్యకర్త పాల్గొనాలన్నారు. బీజేపీ జిల్లా అధ్యక్షుడు నార్ని తాతాజీ, కొవ్వూరి వెంకటరెడ్డి, పోలిశెట్టి బాలాజీ, పేరిచర్ల సుభాష్‌రాజు, త్రిమూర్తులుతో పాటు వివిధ మండలాల నాయకులు పాల్గొన్నారు.

రిఫరల్ కాంటెస్ట్‌లో పాతూరికి ప్రథమ స్థానం

పెంటపాడు, జనవరి 4: మన టీడీపీ రిఫరల్ కాంటెస్ట్‌లో ఎక్కువ మందితో మన టీడీపీ యాప్ డౌన్లోడ్ చేయించి తాను ప్రథమ స్థానంలో నిలిచినట్లు జిల్లా తెలుగురైతు అధ్యక్షుడు పాతూరి రాంప్రసాద్ చౌదరి తెలిపారు. ఈ సందర్భంగా పాతూరి మాట్లాడుతూ ప్రతి 14 రోజులకు ఒకసారి ఈ కాంటెస్ట్ జరుగుతుందన్నారు. దీనిలో ఎక్కువ సంఖ్యలో యాప్ ను డౌన్లోడ్ చేయించిన ఐదుగురిని ఎంపిక చేస్తారని దానిలో తాను మొదటి స్థానంలో ఉన్నానన్నారు.

బ్రాహ్మణ చెరువు-వీరవాసరం ట్రాఫిక్ మళ్ళింపు

పెనుమంట్ర, ఫిబ్రవరి 4: బ్రాహ్మణ చెరువు, వీరవాసరం రోడ్డులో రెండు చోట్ల సీసీ రోడ్లు నిర్మాణం చేపట్టిన నేపథ్యంలో రోడ్డులో ట్రాఫిక్‌ను మళ్ళిస్తున్నట్లుగా ఆర్‌అండ్‌బీ అధికారులు బ్రాహ్మణ చెరువులో బోర్డును ఏర్పాటు చేశారు. ఈ రోడ్డులో సీసీ రహదారుల అభివృద్ధిపనులు ఇటీవల ఎట్టకేలకు ప్రారంభించారు. ప్రస్తుతం పొలమూరులో హాస్టల్ వద్ద నుంచి సీసీ రోడ్డు నిర్మాణం ఒక పక్క పూర్తి చేశారు. అదే విధంగా వీరవాసరం సమీపంలోని రైస్‌మిల్లు వద్ద కూడా సీసీ రోడ్డు నిర్మాణం జరుగుతున్నాయి. దీంతో ట్రాఫిక్‌కు తీవ్ర అంతరాయం కలగటంతో అధికారులు ఆదివారంనాడు ట్రాఫిక్ మళ్ళింపు బోర్డులు ఏర్పాటు చేశారు.

ఒకవైపే ఆర్టీసీ బస్సులు

భీమవరం నుంచి రాజమండ్రి వెళ్ళే బస్సులు వీరవాసరం- బ్రాహ్మణ చెరువు రోడ్డుమీదుగా వెళ్తాయని, తిరిగి వచ్చేటప్పుడు మాత్రం పాలకొల్లుమీదుగా భీమవరం చేరుకుంటాయని ఆర్టీసీ సీఐ సురేష్ తెలిపారు. ప్రత్యామ్నాయ మార్గాలను పరిశీలించామని అవి అంతగా అనుకూలంగా లేవని అన్నారు. మరలా ఆర్‌అండ్‌బి అధికారులు అనుమతి ఇచ్చిన తరువాత యథావిధిగా తిరుగుతాయని తెలిపారు. ప్రయాణికులు గమనించాలని కోరారు.

కొండయ్య కుటుంబానికి అండగా ఉంటా

యలమంచిలి, ఫిబ్రవరి 4: ఆర్యపేట గ్రామంలో శనివారం రాత్రి జరిగిన అగ్నిప్రమాదంలో కొబ్బరికాయల గొడౌన్ దగ్ధమై తీవ్రంగా నష్టపోయిన బాధిత కొండయ్య కుటుంబానికి అండగా ఉంటానని ఎమ్మెల్యే డాక్టర్ నిమ్మల రామానాయుడు హామీఇచ్చారు. ఎమ్మెల్యే డాక్టర్ నిమ్మల దగ్ధమైన కొబ్బరి గొడౌన్ వద్దకు ఆదివారం ఉదయం వెళ్లి బాధిత కుటుంబసభ్యులను పరామర్శించి ఓదార్చారు. జరిగిన నష్టానికి బ్యాంకుపరంగా ఇన్సూరెన్స్ త్వరితగతిన అందేలా చూస్తానని అన్నారు.

నరిసేకు రఘురాం పరామర్శ

తాడేపల్లిగూడెం రూరల్, ఫిబ్రవరి 4: బీజేపీ జిల్లా ఉపాధ్యక్షుడు నరిసే సోమేష్‌ను ఆ పార్టీ రాష్ట్ర నాయకుడు పురిఘళ్ల రఘురాం ఆదివారం పరామర్శించారు. ఇటీవల సోమేష్ తండ్రి వీర్రాజు అనారోగ్యంతో మృతి చెందడంతో సోమేష్ కుటుంబీకులను పరామర్శించి వీర్రాజు చిత్రపటానికి రఘురాం పూలమాల వేసి నివాళులర్పించారు. ఆయన వెంట బీజేపీ సైనిక్ సెల్ కన్వీనర్ టి. భోగేశ్వరరావు, పార్టీ పెంటపాడు అధ్యక్షుడు దత్తు ప్రసాద్ పాల్గొన్నారు.

కొండ్రుప్రోలులో సకల జన సమ్మేళన యాత్ర

తాడేపల్లిగూడెం రూరల్, ఫిబ్రవరి 4: కొండ్రుప్రోలులో ఆదివారం ఉప ముఖ్యమంత్రి కొట్టు సత్యనారాయణ సకల జన సమ్మేళన యాత్రలో పాల్గొన్నారు. ముందుగా గ్రామంలో ఏర్పాటుచేసిన వైఎస్ విగ్రహాన్ని, సచివాలయ భవనాన్ని ప్రారంభించారు. ఎంపీపీ పి. శేషులత, ఏఎంసీ చైర్మన్ ముప్పిడి సంపత్‌కుమార్, స్థానిక నాయకులు బి. గంగారావు, బండి గణపతి, కంకట రాజారత్నం పాల్గొన్నారు.

ఘనంగా ముళ్ళమ్మ ఆలయ వార్షికోత్సవం


అమ్మవారిని దర్శించుకుంటున్న బాబ్జి

పెంటపాడు, ఫిబ్రవరి 4: అలంపురం ముళ్ళమ్మ ఆలయ 13వ వార్షికోత్సవం ఆదివారం ఘనంగా నిర్వహించారు. అమ్మవారికి ప్రత్యేక పూజలు చేశారు. టీడీపీ నియోజకవర్గ ఇన్‌చార్జి వలవల బాబ్జి అమ్మవారి దర్శించుకున్నారు. భారీ అన్నసమారాధన జరిగింది. కార్యక్రమంలో కిలపర్తి వెంకట్రావు, దాసరి అప్పన్న, సురగాల రాంబాబు, సుంకవల్లి రాజ్‌కుమార్, అంజూరి శ్రీనివాస్, పెనుమర్తి నారాయణ, పెనుమర్తి హరిశ్చంద్రప్రసాద్, పుట్టా దివాకర్, పారిచర్ల యశ్వంత్ తదితరులు పాల్గొన్నారు.

భవిష్యత్ పోరాటాలకు ఉత్తేజం

భీమవరం అర్బన్, ఫిబ్రవరి 4: భవిష్యత్ పోరాటాలకు ఉత్తేజం అంగన్వాడీల పోరాటం అని అంగన్వాడీల అభినందన సభలో పలువురు వక్తలు అన్నారు. ఆదివారం భీమవరం త్యాగరాజ భవనంలో అంగన్వాడీల అభినందన సభకు అంగన్వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ యునియన్ జిల్లా అధ్యక్షులు రూప్సీలక్ష్మి అధ్యక్షతన ఆదివారం నిర్వహించారు. ముఖ్యఅతిథిగా హజరైన అంగన్వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ రాష్ట్ర అధ్యక్షులు జీ. బేబి రాణి మాట్లాడుతూ తాళాలు బద్దలు కొట్టినా, ఎస్మా ప్రయోగించినా అదరకుండా బెదరకుండా పోరును సాగించి ప్రభుత్వాన్ని ఒప్పించి సమస్యలు పరిష్కరించుకున్న అంగన్వాడీల విజయం చారిత్రాత్మకమన్నారు. సీఐటీయు జిల్లా అధ్యక్ష కార్యదర్శులు జెఎన్‌వీ గోపాలన్, రాజారామ్మోహన్ రాయ్ తదితరులు పాల్గొన్నారు.

టీడీపీ పాలనలోనే బీసీలకు న్యాయం

భీమవరం అర్బన్, ఫిబ్రవరి 4: బీసీలకు న్యాయం చేసే ఏకైక పార్టీ టీడీపీ నేనని టీడీపీ రాష్ట్ర కోశాధికారి మెంటే పార్థసారధి అన్నారు. తెలుగుదేశం పార్టీ కృష్ణబలిజ సాధికార సమితి రాష్ట్ర డైరెక్టర్ గంటా త్రిమూర్తులు ఆధ్వర్యంలో ఆదివారం బీసీ పోరుబాట సమావేశాన్ని గంటా త్రిమూర్తులు కార్యాలయంలో నిర్వహించారు. మెంటే పార్థసారధి మాట్లాడుతూ బీసీలంతా ఐకమత్యంతో టీడీపీ-జనసేన అభ్యర్థులను గెలిపించాలన్నారు. కృష్ణబలిజ సాధికారత సమితి రాష్ట్ర కన్వీనర్ కావేటి వేణు మాట్లాడుతూ రాజధాని లేని రాష్ట్రం మన ఆంధ్రప్రదేశ్‌నేనని, 5ఏళ్లలో రాజధానే లేకుండా జగన్ ప్రభుత్వం పరిపాలన సాగించారన్నారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు మద్దుల రాము, మైలాబత్తుల ఐజాక్‌బాబు, గంటా నాగలక్ష్మి, సీహెచ్ ప్రసాదు, జగదీష్ పాల్గొన్నారు.

నేటి నుంచి రక్షణ సువార్త మహాసభలు

భీమవరం అర్బన్, ఫిబ్రవరి 4 : ఈ నెల 5,6,7 తేదీలలో భారతీయ విద్యాభవన్ రోడ్‌లో రక్షణ సువార్త మహాసభలు నిర్వహిస్తున్నట్లు దళిత ఐక్యవేదిక రాష్ట్ర అధ్యక్షుడు గంటా సుందర్ కుమార్ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ సభలను శాసన మండలి చైర్మన్ కొయ్యే మోషేన్ రాజు ప్రారంభిస్తారని, క్రిస్టియన్ మైనార్టీ సెల్ చైర్మన్ మేడిది జాన్సన్ పాల్గొంటారని తెలిపారు.

మిషన్ హాస్పటల్ పరిశీలన

భీమవరం అర్బన్, ఫిబ్రవరి 4: పురాతన క్రైస్తవ సంస్థలకు వైఎస్ జగన్ ప్రభుత్వం అండగా ఉంటుందని ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే గ్రంధి శ్రీనివాస్ అన్నారు. ఆదివారం బేతని పేటలో 300ఏళ్ళ నాటి మిషన్ హాస్పటల్ ప్రాంతాన్ని ఎమ్మెల్యే గ్రంధి శ్రీనివాస్ పరిశీలించారు. మిషన్ హస్పటల్‌కు మంచి చరిత్ర ఉందని, దీనిని అనేక జిల్లాలకు చెందిన ప్రజలు గతంలో వినియోగించుకునేవారన్నారు. కార్యక్రమంలో గంటా సుందర్‌కుమార్, తోట బోగయ్య, తదితరులు పాల్గొనారు.

సబ్‌ప్లాన్ నిధులపై శ్వేతపత్రం ఇవ్వాలి

భీమవరం అర్బన్, ఫిబ్రవరి 4: రాష్ట్రంలో ఎస్సీ కార్పొరేషన్‌లోని ఎస్సీ సబ్ ప్లాన్ నిధులను దళితుల అభివృద్ధికి ఖర్చు చేయడం లేదని.గత నాలుగు సంవత్సరాలలో సబ్ ప్లాన్ నిధులు ఎంత ఖర్చుచేశారో శ్వేత పత్రం విడుదల చేయాలని మాలమహానాడు జిల్లా అధ్యక్షుడు గుండె నగేష్‌బాబు డిమాండ్ చేశారు. భీమవరంలో ఆదివారం మాలమహానాడు సమావేశం నిర్వహించారు. దళితులంతా ఐక్యమత్యంతో ఒక తాటిపైకి వచ్చిన రోజే మన హక్కులను సాధించుకోవడం జరుగుతుందన్నారు.

ఇంటింటికి రేషన్ పంపిణీ

ఉండి, ఫిబ్రవరి 4: ఈనెల 1వ తేదీ నుంచి ఇంటింటికి రేషన్ పంపిణీ కార్యక్రమం ప్రారంభమైంది. మొదటి రోజు సర్వర్ సమస్యతో అంతంత మాత్రమే పంపిణీ కార్యక్రమం సాగింది. రెండుమూడు రోజుల నుంచి సరుకుల పంపిణీ ఎండియులు త్వరితగతంగా చేపట్టారు. కార్డుదారులకు బియ్యం ఉచితంగాను, పంచదార, కందిపప్పు నగదులకు అందిస్తున్నారు. వేలిముద్రలను వేసి లబ్ధిదారులు తమ సరుకులను తీసుకోవాలని రేషన్‌డీలర్లు, ఎండియు వాహనదారులు కోరారు. కార్డుదారులకు త్వరితగతంగా సరుకులను అందించాలని సివిల్ సప్లయిస్ డీటీ మహేశ్ కోరారు.

కూచిపూడి, జానపద నృత్య పోటీలు



పాలకొల్లు టౌన్, జనవరి 4:పాలకొల్లు క్షత్రియ కళ్యాణ మండపంలో ఆదివారం ఉభయ తెలుగు రాష్ట్రాల కూచిపూడి, జానపద నృత్య పోటీలు జరిగాయి. 2వేల మంది కళాకారులు ఈపోటీల్లో పాల్గొని ప్రదర్శనలు ఇచ్చారు. పాలకొల్లు కూచిపూడి నృత్య కళాశాల వారు క్షత్రియ సంక్షేమ పరిషత్ అధ్యక్షుడు భూపతిరాజు విశ్వనాధరాజుకు విప్లవ వీరుడు అల్లూరి సీతారామరాజు స్మారక సేవ అవార్డును ప్రదానం చేశారు.

మావుళ్ళమ్మకు గజమాలతో అలంకారం



భీమవరం టౌన్, ఫిబ్రవరి 4 : మావుళ్ళమ్మ అమ్మవారికి పట్టణానికి చెందిన ముత్యాల హరి రమాదేవి దంపతులు గజమాల అందించారు. అమ్మవారిని గజమాలతో అలంకరించారు.

దేవాంగ సంఘాలు విద్య, వైద్యంపై దృష్టి పెట్టాలి


దేవాంగ సంక్షేమ సంఘం కార్యవర్గాన్ని అభినందిస్తున్న రాష్ట్ర నాయకులు

పాలకొల్లు టౌన్, ఫిబ్రవరి 4:దేవాంగ సంక్షేమ సంఘాలు విద్య వైద్య సేవలపై దృష్టి పెట్టి మారుమూల ప్రాంతాల్లో ఉచితం వైద్య శిబిరాలు నిర్వహించాలని రాష్ట్ర దేవాంగ సంక్షేమ సంఘం అధ్యక్షుడు దేవాంగ కర్త నాగరాజు కోరారు. పాలకొల్లులో ఆదివారం జరిగిన జిల్లా దేవాంగ సంఘం నూతన పాలకవర్గం ప్రమాణ స్వీకారోత్సవ సభలో ఆయన ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. జిల్లా దేవాంగ సంఘం అధ్యక్షుడుగా పట్నం గణేశ్వరరావు, ప్రధాన కార్యదర్శిగా ద్వార హేమకుమార్, గౌరవాధ్యక్షుడుగా మావూరి సుందరరావు, కార్యవర్గ సభ్యులు ప్రమాణస్వీకారం చేశారు. కార్యక్రమంలో సంఘ ఆల్‌ఇండియా ఫెడరేషన్ అధ్యక్షుడు బండారు ఆనందప్రసాద్, రాష్ట్ర దేవాంగ సంఘ వ్యవస్థాపక అధ్యక్షుడు నక్కిన చిన్న వెంకటరాయుడు, రాష్ట్ర సంఘ ప్రధాన కార్యదర్శి పుచ్చల రామకృష్ణ, అసోసియేట్ అధ్యక్షుడు మానెం బసవరాజు, మహిళా విభాగం అధ్యక్షురాలు ఉప్పుగంటి రాజశ్రీ, ప్రధాన కార్యదర్శి మానెం జయలక్ష్మి పాల్గొన్నారు.